ఈనాడు
అన్నమయ్య
గురువారం అక్టోబరు 3, 2024

గాంధీజీ అడుగుజాడల్లో నడుద్దాం



గాంధీజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

మంత్రి మండిపల్లి

రాయచోటి, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ జాతి పిత మహాత్మాగాంధీ అడుగుజాడల్లో నడుద్దామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడలశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్‌లోని మహాత్మాగాంధీ విగ్రహానికి బుధవారం ఆయన పూలమాల వేసి ఘనంగా నివాళుర్పించారు. ఆయన చూపిన అహింస మార్గాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రజలందరూ స్వచ్ఛత కార్యక్రమాల్లో భాగస్వాములై స్వచ్ఛ పట్టణాలు, స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దుకోవాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ వాసుబాబు, వివిధ శాఖల అధికారులు, తెదేపా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి దసరా శరన్నవరాత్రులు



విద్యుత్తు దీపాలంకరణలో వీరభద్రస్వామి ఆలయం

జిల్లాలో గురువారం నుంచి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభం కానుండడంతో ఆలయాలు ముస్తాబయ్యాయి. విద్యుత్తు దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. రాయచోటిలోని వీరభద్రస్వామి ఆలయం, ఎస్ఎన్‌కాలనీలోని శివాలయాన్ని అర్చకులు శుద్ధి చేశారు. ఆయా ఆలయాల్లోని అమ్మవారు గురువారం నుంచి ప్రత్యేక అలంకరణల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

- న్యూస్‌టుడే, రాయచోటి

తాగునీటి సమస్యకేదీ చికిత్స?



కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో నిరుపయోగంగా జల్ మందిర్

కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో దాహం కేకలు

ఫ్లోరైడ్ నీటితో వైద్యపరికరాలు, యంత్రాలకు ముప్పు

తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. ఉప్పు నీటితో వైద్యపరికరాలు పాడైపోతున్నాయి. వైద్య సేవలందించడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దంత వైద్య కళాశాలలో నీటి వినియోగం అధికంగా ఉంటుంది. వెంటనే సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేయండి.

- జీవీలా రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌తో కడప దంత వైద్య కళాశాల వైద్యుల మొర

కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో నీటి కొరత ఆశ్చర్యం కలిగిస్తోంది. పెద్ద తరబడి వైఎస్ కుటుంబమే పాలిస్తున్నా ఎందుకు పట్టించుకోలేదు. నీటి కొరత లేకుండా చూడాలని కలెక్టర్‌కు ఆదేశాలిచ్చాం. శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

- సత్యకుమార్, రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖమంత్రి

కడపలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. జిల్లా నుంచి ఇద్దరు ముఖ్యమంత్రులుగా పని చేసినా శాశ్వత పరిష్కారం చూపలేకపోయారు. కడపలోని మురుగునీరు పెన్నాలోకి వెళుతుంది. అక్కడ నుంచి బోర్లు ద్వారా ఆ నీటినే నగరానికి పంపింగ్ జరుగుతున్న దుస్థితి నెలకొంది. సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించాం. ఇప్పటికే కార్య సాధన దిశగా అడుగులు వేగంగా వేస్తున్నాం.

- తాజాగా దంత కళాశాల మినీ ఆడిటోరియం ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాధవిరెడ్డి

- ఈనాడు, కడప, న్యూస్‌టుడే, సర్వజన ఆసుపత్రి

దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి మానసపుత్రికగా చెప్పుకొనే కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఏర్పాటు చేసి 15 ఏళ్లు దాటినా నేటికీ మంచినీటి కొరత వెంటాడుతోంది. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, ఆయన తనయుడు జగన్ జిల్లా నుంచి ముఖ్యమంత్రులుగా పదేళ్లపాటు పని చేసినా ఆసుపత్రి దశ మాత్రం మారలేదు. అప్పటి వైకాపా ప్రభుత్వ హయాంలో ఒప్పందం మేరకు రోజుకు 2.5 గ్యాలన్ల నీరందించాల్సి ఉండగా... ఒక గ్యాలన్ నీరు మాత్రమే సరఫరా అవుతోంది. ఫలితంగా వైద్యులు, సిబ్బంది, ప్రత్యేకించి రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రితో పాటు సూపర్‌స్పెషాలిటీ, క్యాన్సర్ ఆసుపత్రి సైతం అదే బాటులో పడ్డాయి. దీంతో నీటి వినియోగం భారీగా పెరిగినా ఆమేరకు సరఫరా జరగడంలేదు. సమస్య శాశ్వత పరిష్కారానికి ఎన్డీయే ప్రభుత్వంపైనే అన్ని వర్గాలు ఆశలు పెట్టుకున్నాయి.

● సుమారు 182 ఎకరాల్లో నిర్మించిన కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని 2006లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియా గాంధీ చేతులమీదుగా ప్రారంభించారు. రాయలసీమకే తలమానికంగా ఆధునిక పద్ధతిలో 730 పడకల సామర్థ్యంతో నిర్మించిన ఈ ఆసుపత్రి 2019లో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిగా రూపాంతరం చెంది 2023 నాటికి 930 పడకలకు విస్తరించింది. రోజుకు 1,500 మంది అవుట్ పేషెంట్లు, 700 నుంచి 730 మంది వరకు ఇన్ పేషెంట్లు వైద్యసేవలు పొందుతున్నారు.

● ఆసుపత్రిలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, ఆర్థోపెడిక్స్, పీడియాట్రిక్స్, ఈఎన్‌టీ, ఆప్తమాలజీ, పల్మనాలజీ, రేడియాలజీ, అనస్థీసియాలజీ, డెంటస్ట్రీ, ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాలున్నాయి. అన్ని విభాగాలకు కలిపి వైద్యులు, స్టాఫ్ నర్సులు, పారామెడికల్ సిబ్బంది కలిపి 942 మంది ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 692 మంది పని చేస్తున్నారు. మిగిలిన 250 వరకు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వైద్య కళాశాలలో దాదాపు వెయ్యి మందికి పైగానే మెడికోలు విద్యనభ్యసిస్తున్నారు. ఇవి కాకుండా ఇటీవలే సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, మానసిక వైద్యశాల, కాన్సర్ ఆసుపత్రి ప్రారంభమయ్యాయి.

● అన్ని విభాగాల వైద్యులు, వైద్య సిబ్బందితోపాటు రోగులు, వారి సహాయకులకు మంచినీటి కొరతను తీర్చడంలో గత పాలకులు విఫలమయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆసుపత్రి ప్రారంభంలోనే 2.5 గ్యాలన్ల తాగునీరు నిత్యం ఇవ్వాలని నగరపాలక సంస్థగా రూపాంతరం చెందిన గత పురపాలక సంఘంతో ఒప్పందం జరిగింది. ప్రస్తుతం గ్యాలన్ నీరు కూడా సరఫరా కావడంలేదు. ఆసుపత్రి ఆవరణలో 8 బోరు బావుల ద్వారా నీరు సరఫరా చేస్తున్నా ఫ్లోరైడ్ శాతం అత్యధికంగా ఉండటంతో పైపులన్నీ పాడైపోతున్నాయి. ఫలితంగా వివిధ విభాగాలకు మంచి నీరు అందడంలేదు.

● ముఖ్యంగా ల్యాబొరేటరీలకు నీరు సరఫరా కాకపోవడంతో వైద్య సిబ్బంది పరీక్షలు చేయడానికి అష్టకష్టాలు పడుతున్నారు. నీటితో వినియోగించే వైద్య పరికరాలు సైతం ఫ్లోరైడ్ కారణంగా మరమ్మతులకు గురవుతున్నాయి. పలువురు దాతల సహకారంలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లు సైతం నీటి కొరతతో మూతపడ్డాయి. ఇక్కడకొచ్చే రోగులతో పాటు వారి సహాయకులు తాగునీటి సీసాలను వెంట తెచ్చు కోవాల్సిన దుస్థితి నెలకొంది. కడప నగరపాలక సంస్థ పూర్తి స్థాయిలో నీటిని సరఫరా చేసే పక్షంలో సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుంది.



ఖాళీ తాగునీటి సీసాలతో ఎదురు చూస్తున్న రోగుల సహాయకులు



నీరందించని కుళాయిని చూపుతూ...



ఫ్లోరైడ్ నీటితో పాడైన పైపులైన్లు

వాటర్‌గండిలో పైపులైన్ల సమస్య

వాటర్‌గండిలో పైపులైన్లు పగిలిపోవడంతో కడప నగరానికి మూడో వంతు నీటిని సైతం సరఫరా చేయలేకపోతున్నాం. యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి నీటిని అందించడానికి మరో నెల రోజుల సమయం పడుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆసుపత్రికి ఒప్పందం మేరకు నీటిని సరఫరా చేయలేకపోతున్నాం. సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం.

- నందన్, కమిషనరు, కడప నగరపాలక సంస్థ

పురపాలక ఉపాధ్యాయుల సత్యాగ్రహ దీక్ష



మదనపల్లె పురపాలక సంఘం కార్యాలయం ఎదుట సత్యాగ్రహ దీక్ష చేస్తున్న పురపాలక ఉపాధ్యాయులు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : పురపాలక సంఘాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాబీర్ డిమాండు చేశారు. మదనపల్లె పురపాలక సంఘం కార్యాలయం ఎదుట బుధవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సత్యాగ్రహదీక్ష చేశారు. కార్యాలయం ఆవరణలోని గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం అందించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు వర్తించే సౌకర్యాలు పురపాలక సంఘంలో పనిచేసేవారికి వర్తింపజేయడంలేదన్నారు. రాష్ట్ర విభజన జరిగి 10 ఏళ్లయినా నేటికీ సమస్యకు పరిష్కారం చూపలేదన్నారు. పురపాలక సంఘం ఉన్నత పాఠశాలల్లో ఇప్పటికీ తగినంత మంది ఉపాధ్యాయుల్లేరని, 3, 4, 5 తరగతులను విలీనం చేశారే తప్ప పాఠశాల సహాయకుల పోస్టులు మంజూరు చేయలేదన్నారు. పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు ఇచ్చినట్లే పురపాలక ఉపాధ్యాయులకు అర్బన్ ఎంఈవో పోస్టులు ఇవ్వాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామకానికి వీలుగా ఎస్జీటీ, పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. నవంబరులోగా ఉద్యోగోన్నతులివ్వాలని, అర్హులైన ప్రధానోపాధ్యాయులను ఎంఈవోలుగా నియమించాలని, బోధనేతర సిబ్బందిని నియమించాలని, బదిలీలు చేపట్టాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు సుధాకర్‌నాయుడు, కార్యదర్శులు ఆదినారాయణ, వెంకటరమణ, డివిజనల్ కన్వీనర్ సుధాకర్, నాయకులు రెహమాన్, రవీంద్ర, నరసింహులు, గురునారాయణచారి తదితరులు పాల్గొన్నారు.

కిలో టమాట రూ.90

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: మదనపల్లె వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం టమాట ధర అత్యధికంగా కిలో రూ.90 వరకు పలికింది. ఈ మేరకు రైతులు తీసుకొచ్చిన 25 కిలోల క్రేట్ ధర అత్యల్పంగా రూ.1,750 నుంచి నాణ్యమైన టమాట అత్యధికంగా రూ.2,250 వరకు పలకడం ఈ ఏడాదిలో ఇదే తొలిసారి. ప్రస్తుతం దిగుబడులు తగ్గడంతోనే ధర పుంజుకుందని మార్కెట్ అధికారులు చెబుతున్నారు. బయట ప్రాంతాల్లో పంట దిగుబడులు లేకపోవడంతో పాటు మదనపల్లె మార్కెట్ సీజన్ కాకపోవడంతోనూ దిగుబడులు తగ్గాయి. మదనపల్లె మార్కెట్‌కే కాకుండా జిల్లాలోని ములకలచెరువు, బి.కొత్తకోట, గుర్రంకొండ, కలకడ, వాల్మీకిపురం, పీలేరు మార్కెట్లకు కూడా దిగుబడి తగ్గింది. మదనపల్లె మార్కెట్‌కు బుధవారం కేవలం 84 టన్నులు మాత్రమే రైతులు తీసుకొచ్చారు. దీంతో ఏ-గ్రేడ్ కిలో ధర రూ.82 నుంచి రూ.90 వరకు, బీ-గ్రేడ్ ధర రూ.70 నుంచి రూ.80 వరకు పలికింది. రైతుల నుంచి వ్యాపారులు సగటున కిలో రూ.78 నుంచి రూ.88తో కొనుగోలు చేసినట్లు మార్కెట్ యార్డు కార్యదర్శి అభిలాష్ తెలిపారు.

నగర పంచాయతీ... ఎన్నికల మాటేమిటి?



బి.కొత్తకోట నగర పంచాయతీ కార్యాలయం

- న్యూస్‌టుడే, బి.కొత్తకోట

బి.కొత్తకోటకు నిధులు కేటాయించని కేంద్రం

అభివృద్ధి పనులకు గ్రహణం

నిధుల కొరతతో సతమతమవుతున్న బి.కొత్తకోట నగర పంచాయతీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆర్థిక సంఘం నిధుల కేటాయింపును కేంద్రం తాజాగా నిలిపేసింది. నగర పంచాయతీకి ఎన్నికలు నిర్వహించకుండా గత నాలుగేళ్లుగా ప్రత్యేకాధికారి పాలనను కొనసాగిస్తుండటంతోనే ఈ నిర్ణయం తీసుకుంది. గత వైకాపా ప్రభుత్వం పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో నిధులను కోల్పోవాల్సిన పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలోని స్థానిక సంస్థలకు కేంద్రం వివిధ అంశాలను ప్రాతిపదికగా చేసుకుని ఆర్థిక సంఘం నిధులను ఇస్తుండగా కనీస వసతుల కల్పనకు వీటిని ఖర్చు చేస్తున్నారు. బి.కొత్తకోట నగర పంచాయతీకి 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.1.82 కోట్లు, 2022-23 సంవత్సరంలో రూ.1.80 కోట్లు 15వ ఆర్థిక సంఘం నిధుల కింద మంజూరు కాగా వివిధ అభివృద్ధి పనులను అధికారులు చేపట్టారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి తొలి విడతలో రూ.82 లక్షల నిధులొస్తాయని అధికారులు ఎదురు చూస్తున్నారు. ఇంతలోనే తాము సూచించిన సంస్కరణలను అమలు చేయని పట్టణ స్థానిక సంస్థలకు నిధులివ్వలేమని కేంద్రం చేతులెత్తేసింది. తొలుత నగర, పురపాలక సంస్థలకు ఎన్నికలను నిర్వహించినప్పుడే ఆర్థిక సంఘం నిధులిస్తామని కేంద్రం షరతు విధించింది. మరోవైపు ఆస్తిపన్నుతో పాటు ఇతర ఆదాయ వనరులు పెంచుకోవాలని సూచించింది. ఈ షరతులను పాటించని రాష్ట్రంలోని 23 పట్టణ సంస్థలకు రూ.138 కోట్ల నిధులివ్వకుండా కోత పెట్టింది. ఈ క్రమంలో బి.కొత్తకోట నగర పంచాయతీకి నిధుల కేటాయింపులు నిలిచిపోయాయి. గత వైకాపా ప్రభుత్వం కోర్టు కేసులను సాకుగా చూపుతూ రాజకీయ కారణాలతో నగర పంచాయతీ ఎన్నికలను ఎప్పటికప్పుడు వాయిదా వేస్తూ వచ్చింది. కొత్తగా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం నగర పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఉన్న అవరోధాలను తొలగించి కొత్త పాలకవర్గాన్ని తాము ఎన్నుకునేవిధంగా చూడాలని పుర వాసులు కోరుతున్నారు. ఎన్నికలు నిర్వహించడంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని, ఇది తమ పరిధిలోని అంశం కాదని అధికారులు స్పష్టం చేశారు.

మదనపల్లెను ముంచెత్తిన భారీ వర్షం



కదిరి రోడ్డులోని గ్రూపు థియేటర్ల కూడలిలో నిలిచిన వర్షపు నీరు

మదనపల్లె పట్టణంలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. కదిరి రోడ్డులోని గ్రూపు థియేటర్ల కూడలిలో వంతెన దెబ్బతినడంతో తవ్వేసి వదిలేయడంతో వర్షపునీరు బయటకు వెళ్లే అవకాశం లేక మురుగు నీటితో కలిసి రోడ్డుపై నిలిచిపోయింది. ప్రశాంత్‌నగర్ వీధులు, అంబేడ్కర్ కూడలి, ఎంఎల్‌ఎల్ ఆసుపత్రి పక్కరోడ్డుపై వర్షపునీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. వైఎస్ఆర్ కాలనీ, అప్పారావు తోటలోని రహదారులు జలమయమయ్యాయి. ఇళ్ల చుట్టూ వర్షపునీరు చేరింది. - న్యూస్‌టుడే, మదనపల్లె పట్టణం



జలమయమైన ప్రశాంత్‌నగర్ ప్రధాన రహదారి

అంధకారంలో ఆసుపత్రి



టవల్‌తో రోగికి గాలి విసురుతున్న సహాయకులు

మదనపల్లెలో బుధవారం కురిసిన భారీ వర్షానికి స్థానిక ప్రభుత్వ సర్వజన బోధన ఆసుపత్రికి విద్యుత్తు సరఫరా అందించే తీగలు తెగిపోవడంతో అంధకారం నెలకొంది. మధ్యాహ్నం 3 గంటల నుంచి సమస్య తలెత్తడంతో వార్డుల్లోని రోగులు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరయ్యారు. దీంతో ఆసుపత్రి విద్యుత్తు సిబ్బంది గర్భిణులు, పురుషులు, మహిళల వార్డులతోపాటు అత్యవసర విభాగాలకు తాత్కాలికంగా విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించారు. గురువారం పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి అన్ని విభాగాలకు విద్యుత్తు సరఫరా అందిస్తామని వైద్యాధికారులు తెలిపారు. - న్యూస్‌టుడే, మదనపల్లె వైద్యం



చరవాణి వెలుగులో మందులిస్తున్న వైద్యసిబ్బంది

నేటి నుంచి దసరా సెలవులు

రాయచోటి, న్యూస్‌టుడే: ఈ నెల 3వ తేదీ నుంచి 13వ తేదీ వరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ప్రభుత్వం దసరా సెలవులు ప్రకటించిందని డీఈవో శివప్రకాష్‌రెడ్డి తెలిపారు. సెలవుల్లో తరగతులు నిర్వహించరాదని, ఎవరైనా ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

వీహెచ్‌పీ ర్యాలీ



రాజంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న వీహెచ్‌పీ నాయకులు

తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగంపై నిరసన

రాజంపేట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో దేవాదాయశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆలయాల నిర్వహణను హిందూ ధార్మిక సంఘాలకు అప్పగించాలని విశ్వహిందూ పరిషత్తు (వీహెచ్‌పీ) దక్షిణ ప్రాంత కార్యదర్శి కాకర్ల రాముడు డిమాండు చేశారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగంపై రాజంపేటలో బుధవారం వీహెచ్‌పీ ఆధ్వర్యంలో హిందూ ధార్మిక సంఘాలు నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక రహదారులు, భవనాలశాఖ కార్యాలయం నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు జైశ్రీరాం, భారత్‌మాతాకీజై నినాదాలతో ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగానికి కారకులైనవారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని, ఆయాల్లో అన్యమత ఉద్యోగులను తొలగించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ, వివిధ ధార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పరీక్షలు నిర్వహించారు... పరికరాలు విస్మరించారు!

- న్యూస్‌టుడే, పీలేరు

పంపిణీ చేసేందుకు 647 మంది గుర్తింపు

జాప్యంతో దివ్యాంగ చిన్నారుల అవస్థలు

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వ, ప్రైవేటుపరంగా విద్యాసంస్థలు పోటీపడి విద్యార్థులకు బోధిస్తున్నా ప్రత్యేకించి దివ్యాంగ చిన్నారులకు మాత్రమే ప్రభుత్వపరంగా ప్రత్యేక బడులు ఏర్పాటు చేసి విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారు. ఇలాంటి చిన్నారులకు ప్రభుత్వపరంగా అందాల్సిన ప్రోత్సాహకాలు నిర్ణీత సమయంలో అందించడంలో జాప్యం జరుగుతుండడంతో దివ్యాంగ చిన్నారులు అవస్థలు పడుతున్నారు. దివ్యాంగ చిన్నారులకు జీవితంపై భరోసా ఇచ్చేందుకు ప్రత్యేకంగా మండల కేంద్రాల్లో ‘భవిత కేంద్రాల’ను ఏర్పాటు చేసి వీరికి బోధించేందుకు ప్రత్యేకంగా శిక్షణ పొందిన ఉపాధ్యాయులను నియమించారు. ఇలాంటి విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో అవయవ లోపాలను గుర్తించి అవసరమైన పరికరాలు అందించేందుకు ఏడాదికొకసారి ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారు. వీరికి మూడు చక్రాల బ్యాటరీ సైకిళ్లు, వినికిడి పరికరాలు, వీల్‌ఛైర్లు, చంక కర్రలు, బెల్ట్ ఛైర్స్, ఎంఆర్ కిట్లు, కృత్రిమ అవయవాలు ఉచితంగా అందజేస్తారు.

ప్రతిపాదనలు పంపాం : జిల్లాలోని 30 మండలాల్లో విద్యాశాఖకు అనుబంధంగా ఉన్న ‘భవిత కేంద్రాల్లో’ చదువుతున్న పిల్లలకు అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ప్రత్యేక వైద్యబృందం ఆధ్వర్యంలో మూడు నెలల కిందట వైద్యపరీక్షలు నిర్వహించారు. పిల్లల్లో అవయవ లోపాలు గుర్తించి వారికి అవసరమైన పరికరాలకు సిఫార్సు చేశాం. పరికరాల విలువలో 30 శాతం మాత్రమే ప్రభుత్వం చెల్లించాల్సి ఉన్నందున అందుకు అవసరమైన నిధులు కూడా ఇటీవల మంజూరు చేశారు. పరికరాలు సరఫరా చేయాలని అధికారులను కోరాం. వచ్చినవెంటనే పంపిణీ చేయిస్తాం. - జనార్దన, సమన్వయకర్త, సహితవిద్య



పిల్లలకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు (పాత చిత్రం)

మూడు నెలలుగా ఎదురుచూపులు

జిల్లాలో మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె, రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గ కేంద్రాల్లో ఈ ఏడాది జులైలో ప్రభుత్వ వైద్యులు అవయవ లోపాలను గుర్తించేందుకు పరీక్షలు నిర్వహించి అవసరమైన పరికరాలు అందించేందుకు సిఫార్సు చేశారు. జిల్లావ్యాప్తంగా 647 మంది పిల్లలకు ప్రత్యేక పరికరాలు అవసరముందని గుర్తించారు. దీంతో ఉచితంగా పరికరాలు వస్తాయని పిల్లల తల్లిదండ్రులు ఆశించారు. పరీక్షలు నిర్వహించి మూడు నెలలవుతున్నా ఇప్పటి వరకు పరికరాలు సరఫరా చేయలేదు. కృత్రిమ అవయవాలు, పరికరాలు లక్నో, రాజస్థాన్ రాష్ట్రాల నుంచి రావాల్సి ఉంది. కృత్రిమ అవయవాల విలువలో 70 శాతం తయారు చేసే సంస్థ రాయితీ ఇస్తుండగా, 30 శాతం మాత్రమే ప్రభుత్వం భరిస్తుంది. పీలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జులై 8న పిల్లలకు పరీక్షలు నిర్వహించారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని సత్వరం పరికరాలు సరఫరా చేయాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

కొండ వంక... మురుగు దొంక

గ్రామీణ మండలం బసినికొండ పంచాయతీ పరిధిలోని వంక ఇది. నిమ్మనపల్లె రోడ్డులోని ఈ కొండ వంక పాముల చెరువు వరకు నాలుగు కిలో మీటర్ల మేర విస్తరించింది. బసినికొండ గ్రామం మీదుగా ఈ వంక వెళ్తుంది. వర్షాలతో కొండమీద నుంచి వచ్చే నీరు ఈ వంక నుంచి చెరువుకు చేరుతాయి. ఈ వంక చుట్టూ గ్రామం, కాలనీలు ఉండటంతో ఇళ్ల నుంచి వెలువడే మురుగు కాలువలు వంకలోకి కలిపేయడంతో మురుగు కాలువగా మారింది. దీంతో పాటు వంక పూడిక, అక్రమ నిర్మాణాలతో అన్యాక్రాంతమైంది. దీంతో వంకలోకి వచ్చే నీరు ప్రవహించేందుకు వీలులేకుండా పోయింది. ప్రస్తుతం మురుగు వంకగా మారి వ్యర్థపు నీరు నిలబడిపోయింది. దోమల నిలయంగా మారి దుర్వాసన వెదజల్లుతోంది. ఈ విషయాన్ని ఇన్‌ఛార్జి ఈవోపీఆర్డీ శ్రీహరి దృష్టికి తీసుకెళ్లగా పారిశుద్ధ్య పనులు చేపట్టి సమస్య లేకుండా చూస్తామని వివరణ ఇచ్చారు.

- న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ



చెత్తచెదారంతో నిండిన కొండ వంక

4న కడపలో ఉద్యోగ మేళా

వైవీయూ (కడప), న్యూస్‌టుడే: కడప నగరంలోని కాగితాలపెంటలో ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 4న శుక్రవారం ఉదయం 10 గంటలకు ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ఏడీ కె.రత్నబాబు ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువతీ, యువకులు హాజరుకావాలని సూచించారు. ఐసీఐసీఐ బ్యాంక్, అభి గ్రీన్ టెక్నాలజీ, రిలయన్స్ తదితర కంపెనీలు పాల్గొంటాయని చెప్పారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ విద్యార్హత పత్రాలు ఆధార్, రెండు ఫొటోలు తీసుకురావాలని తెలిపారు.

అమ్మలకు అమ్మ... సేవల కొమ్మ

అనాథలకు అండగా మహిళా మణులు

సేవే పరమార్థంగా వృద్ధాశ్రమం నిర్వహణ

మదనపల్లె పట్టణం, గ్రామీణ, న్యూస్‌టుడే : తల్లిగా తమ పిల్లల భవిష్యత్తుకు బాటలు వేయడానికి జీవితాన్ని త్యాగం చేశారు... వారి ఎదుగుదలకు సర్వస్వం ధారపోశారు. నా అన్న స్వార్థాన్ని వీడి పిల్లలు ఎదగడానికి శ్రమించారు. వారు తింటే తమ కడుపునిండినట్లు సంతృప్తి చెందారు. వారు హాయిగా నిద్రపోయేందుకు ఎన్నో నిద్ర లేని రాత్రులు గడిపారు. ఇదే వారికి ప్రపంచమని మురిసిపోయారు. ఇలాంటి తల్లులు నేడు నిరాదరణకు గురై నా అన్న వారికి దూరంగా ఒంటరి జీవితాన్ని గడుపుతున్నారు. అలాంటి వారికి అమ్మగా మారిందా వృద్ధాశ్రమం. మేమున్నామంటూ ఆపన్నహస్తం అందిస్తూ అమ్మలకు అమ్మలై సేవ చేస్తున్నారు. జన్మనిచ్చిన తల్లిదండ్రుల బాగోగులు పట్టించుకోని ఈ రోజుల్లో ఎలాంటి సంబంధంలేని వారి యోగక్షేమాలు చూస్తూ 'అమ్మ' అన్న తీయని మాటను వారి నోట అనిపించుకుంటున్నారు. ఆ వివరాలివి.

★ మదనపల్లె పట్టణం అమ్మచెరువుమిట్టలో వెలుగు మహిళా వృద్ధాశ్రమాన్ని 2006లో ప్రారంభించారు. ఆ సమయంలో 10 మంది మాత్రమే ఉన్న వృద్ధులు నేడు 70 మందికి చేరుకున్నారు. వృద్ధుల మనస్వత్వాన్ని చిన్నపిల్లలతో పోల్చుతుంటారు. ఈ నేపథ్యంలో కుటుంబ వ్యవస్థతో ముడిపడి ఉన్న వీరు ఒక్కసారిగా బయట ప్రపంచంలో జీవించాలంటే కొంచెం కష్టమే. దాని నుంచి వీరిని బయటకు తీసుకురావడానికి ఆశ్రమ నిర్వాహకులు భాగ్యలక్ష్మి ఎంతో శ్రమించారు. నేడు నా అన్నవారిని మరిచిపోయి సంతోషంగా జీవించగలిగేలా వారిని మార్చగలిగారు.

★ ఇదే ఆశ్రమంలో సామాజిక కార్యకర్తగా ఎం.గీత 2018 నుంచి పనిచేస్తున్నారు. ఏడు పదులు దాటిన వారికి సేవలు చేయడాన్ని ఆమె ఏనాడు చిన్నతనంగా భావించలేదు. వృద్ధులను చిన్నారుల్లా భావించి వారికి స్నానం చేయించడం, నడవలేని వారిని నడిపించడం, అన్నం తినలేని వారికి తినిపించడం, యోగా చేయించడం వంటివి దినచర్యలుగా చేస్తున్నారు. అయితే ఇక్కడ రాజమ్మ వృద్ధురాలు ఆశ్రయం తీసుకునే వారు. అనారోగ్యంతో ఆమె మరణించినా మృతదేహాన్ని తీసుకెళ్లడానికి బంధువులెవరూ ముందుకు రాలేదు. దీంతో అక్కడే రాజమ్మకు అంత్యక్రియలు నిర్వహించారు. ఈ ఘటన తనను చాలా కలచి వేసిందని గీత చెప్పారు. ఆశ్రమంలో ఉన్న వారిని తన కుటుంబ సభ్యులతో సమానంగా చూసుకుంటున్నానని ఆమె తెలిపారు.

★ ఇదే ఆవరణలో వెలుగు ప్రత్యేక పాఠశాల ఉంది. ఈ పాఠశాల ప్రిన్సిపాల్‌గా లీనా కుమారి 20 సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. ఇక్కడ మతిస్థిమితం లేనివారు, దివ్యాంగులు, బుద్ధిమాంద్యం కలిగిన పిల్లలున్నారు. ఇలాంటి పిల్లలకు లీనాకుమారి ముందు అమ్మగా, ఆ తర్వాత టీచర్‌గా సేవలందిస్తున్నారు. సొంత బిడ్డలుగా భావించి ఎంతో ఓపికతో విద్యార్థులకు సేవలందిస్తున్నారు. వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి సకలాంగులతో పోటీ పడగలరని నిరూపిస్తున్నారు. పిల్లల తల్లిదండ్రులు కూడా ఆశ్చర్యపోయేలా వారిని తీర్చి దిద్దుతున్నారు. ఇంత మంది పిల్లలు తనను అమ్మా అని పిలుస్తుంటే అంతకంటే ఇంకేం కావాలంటూ లీనా కుమారి తన మనసులోని మాటను చెప్పారు.



మదనపల్లె పట్టణం అమ్మచెరువుమిట్టలోని వృద్ధాశ్రమం

18 సంవత్సరాలుగా సేవకు అంకితం

వెలుగు మహిళా వృద్ధాశ్రమానికి కన్వీనర్‌గా వెలుగు ప్రత్యేక పాఠశాల కార్యదర్శి ఉదయ్ మోహన్‌రెడ్డి సతీమణి భాగ్యలక్ష్మి 18 సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. ఆశ్రమంలో ఉన్న మహిళలకు అన్నీ తానై చూసుకుంటున్నారు. తన భర్త ఆశయానికి అనుగుణంగా సేవా మార్గంలో పయనించడానికి నిర్ణయించుకున్నారు. వృద్ధాశ్రమంలో ఉన్న మహిళల ప్రవర్తన మార్చడానికి ఆమె అనేక ఇబ్బందులు పడ్డారు. మొదట వారికి ఆధ్యాత్మిక చింతన కల్పించడానికి భాగ్యలక్ష్మి పట్టణంలోని బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం నిర్వహించే ఆధ్యాత్మిక శిక్షణ కార్యక్రమంలో శిక్షణ పొందారు. ఆశ్రమంలో ఉన్న మహిళలకు ఆధ్యాత్మికతపై ఆసక్తి పెరిగే విధంగా కృషిచేశారు. దీంతో పాటు వారి ఆరోగ్య సమస్యల పరిష్కారానికి ఒక తల్లిలా వ్యవహరించారు. సాత్విక ఆహారపు అలవాట్లను పాటించే విధంగా వారితో మార్పు తీసుకొచ్చారు. నేడు వారికి నా అన్న వారులేరేమో కానీ... మిగిలిన వన్నీ సమకూర్చి కుటుంబ సభ్యులుగా చూస్తున్నారు. ఇలాంటి వారికి సేవ చేయడమే భాగ్యంగా స్వీకరిస్తున్నట్లు భాగ్యలక్ష్మి సంతోషం వ్యక్తం చేశారు.



వృద్ధాశ్రమంలోని అనాథలకు భోజనం వడ్డిస్తున్న భాగ్యలక్ష్మి, గీత

స్తంభాలు నాటారు... దీపాలు మరిచారు

జాతీయ రహదారిపై గుర్రంకొండ పట్టణం నుంచి వ్యవసాయ మార్కెట్ వరకు గుత్తేదారు విద్యుత్తు స్తంభాలు నాటారు. కానీ వాటికి దీపాలు అమర్చడం మరిచిపోయారు. నిబంధనల మేరకు జాతీయ రహదారిపై టోల్ వసూలు చేయాలంటే ఆ రహదారిపై ఎక్కడా పనులు చేయకుండా ఉండకూడదు. అయితే అందుకు విరుద్ధంగా ఈ రహదారిపై స్తంభాలు ఏర్పాటు చేసి ఏడాది గడుస్తున్న వీధి దీపాలు అమర్చడానికి చర్యలు చేపట్టలేదు. రంగినీ మహల్, వినాయక ఆలయం, మగ్బీరా డూమ్‌కు వెళ్లే రహదారులు ఈ మార్గంలో ఉన్నాయి. చీకట్లో వెళ్లాలంటే జనం ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులైన దీపాలు అమర్చడానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, గుర్రంకొండ



ఆసుపత్రి సిబ్బంది బాధ్యతగా పనిచేయాలి

- వైద్యాధికారులతో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సమీక్ష
- 6న ఆరోగ్యశాఖ మంత్రి మదనపల్లెకు రాక

మదనపల్లె వైద్యం, న్యూస్‌టుడే : ఆసుపత్రిలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరు బాధ్యతగా పనిచేయాలని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. బుధవారం మదనపల్లె ప్రభుత్వ సర్వజన బోధన ఆసుపత్రి వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోడ్డు ప్రమాద బాధితులను పరామర్శించారు. అనంతరం సిబ్బందితో సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ కొంతమంది సీనియర్ వైద్యులు గదులకే పరిమితమౌతున్నారని దీని వల్ల జూనియర్ వైద్యులు ఆసుపత్రికి వచ్చే వారిని రెఫర్ చేస్తున్నారన్నారు. దీని వల్ల ఆసుపత్రిలో వైద్య సేవలపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయన్నారు. రోజూ ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్య కళాశాల ప్రిన్సిపల్ ఆసుపత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించాలన్నారు. సీనియర్ వైద్యులు ఖచ్చితంగా ఓపీల్లో చికిత్స అందించాల్సిందేనని ఆయన సూచించారు. ఈ నెల 6న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ మదనపల్లె పర్యటన సందర్భంగా ఆసుపత్రికి అవసరమైన సౌకర్యాలపై సమాచారం ఇవ్వాలని కోరారు. అనంతరం విభాగాల వారీగా సమీక్ష నిర్వహించారు. గైనకాలజీ విభాగంలో అయిదుగురు వైద్యులు ఉన్నారని గర్భిణుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో సిబ్బందిపై అదనపు భారం పడుతోందని విన్నవించారు. దీనిపై ఎమ్మెల్యే డీసీహెచ్‌ఎస్‌తో మాట్లాడి వైద్యుల సంఖ్య పెంచే అవకాశం ఉంటే చూడాలన్నారు. గైనకాలజీ విభాగంలో ల్యాప్రోస్కోపీ, హిస్టరోస్కోపి శస్త్రచికిత్సలకు ఇబ్బంది అవుతోందని తెలిపారు. అలాగే అనస్థీషియా యంత్రం కూడా అవసరం ఉందని సూచించారు. రేడియాలజీ విభాగంలో వైద్యురాలు ఒక్కరే ఉండటంతో ఇబ్బందికరంగా ఉందని, ఒకే ఎక్స్‌రే యంత్రంతో సమస్యలు తప్పడం లేదన్నారు. 500 ఎంఏ ఎక్స్‌రే యంత్రం మరొకటి అవసరం ఉందని తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులతో మాట్లాడి మరో రేడియాలజిస్టు నియామకానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈఎన్‌టీ విభాగంలో ఆడియాలజిస్ట్ లేకపోవడంతో సదరం ధ్రువపత్రాల పంపిణీలో ఇబ్బంది వస్తోందని వైద్యురాలు విన్నవించడంతో సాధ్యమైనంత త్వరగా సమస్య పరిష్కరిస్తామన్నారు. రక్తనిధి కేంద్రంలో, ల్యాబ్‌లో సీబీసీ యంత్రం అవసరం ఉందని, అలాగే రక్త నిల్వకు రిఫ్రిజిరేటర్ అవసరం ఉందని చెప్పడంతో ఏపీఎంఎస్‌ఐడీసీ అధికారులతో మాట్లాడి ఏర్పాటు చేయిస్తామన్నారు. ఈ సమస్యలన్నీ వెంటనే పరిష్కరించి ఈ నెల 15వ తేదీ లోగా అన్ని గదులను ఆసుపత్రికి అప్పగించాలని ఏపీఎంఎస్‌ఐడీసీ డీఈ కరిముల్లాఖాన్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. ఆసుపత్రిలో పారిశుద్ధ్య విభాగంలో సిబ్బంది కొరత ఉందని, ఆసుపత్రి స్థాయి పెరిగిన మేరకు సిబ్బందిని పెంచాలని కోరారు. రాష్ట్రంలోనే ఆసుపత్రి ఏ-గ్రేడ్‌లో ఉండేదని అదే తరహాలో ప్రస్తుతం ఉన్న వైద్య సిబ్బంది పనిచేసి ఆసుపత్రికి పేరు తేవాలని కోరారు. 21 మంది వైద్యులు గాంధీ జయంతి సందర్భంగా ఎలాంటి అనుమతి తీసుకోకుండా సెలవు పెట్టడం బాగోలేదని ఇది పునరావృతం అయితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్ రాజు, వైద్య కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ అపర్ణ, ఆర్ఎంవో డాక్టర్ ప్రసాద్‌రాజు, నర్సింగ్ సూపరింటెండెంట్ మంజుతో పాటు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



వైద్యుల సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

త్వరలో ఆర్వోఆర్ కోర్టు భవనం నుంచి విధులు

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: మదనపల్లె డివిజన్ కార్యాలయంలోని ఆర్వోఆర్ కోర్టు భవనం నుంచి విధులు నిర్వర్తించేందుకు సన్నాహాలు చేస్తున్నామని సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ తెలిపారు. ఆయన బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలోని రెవెన్యూ డివిజనల్ కోర్టు భవనాన్ని పరిశీలించారు. గత జులై 21వ తేదీ రాత్రి సబ్ కలెక్టర్ కార్యాలయంలో దస్త్రాలు దహనం ఘటన చోటుచేసుకోగా, పోలీసులు కార్యాలయంలో ఘటన జరిగిన గదులను స్వాధీనం చేసుకున్నారు. కొన్ని రోజులపాటు డివిజన్‌లో రెవెన్యూ పరిపాలన అస్తవ్యస్తంగా మారింది. దీంతో ఘటన జరిగిన 10 రోజుల తరువాత సబ్ కలెక్టర్ కార్యాలయంలోని హంద్రీనీవా సుజల స్రవంతి భూసేకరణ భవనంలో సాధారణ పరిపాలన కొనసాగుతున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం అందుబాటులో ఉన్న కంప్యూటర్లు, టేబుళ్లతో సద్దుకుని సాధారణ విధులతో పాటు, ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కూడా ఇక్కడే నిర్వహిస్తున్నారు. కార్యాలయంలో కాలిపోయిన భవనాన్ని గత వారం రోజుల కిందట పోలీసుల నుంచి రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు బుధవారం రెవెన్యూ కోర్టు భవనాన్ని పరిశీలించిన సబ్ కలెక్టర్ మరమ్మతు చేసేందుకు సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ... కాలిపోయిన భవనం మరమ్మతులకు అవసరమైన నిధులకు రోడ్లు భవనాలశాఖ అధికారులతో ప్రతిపాదనలు సిద్ధం చేయించి పంపనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఇందులో ఉన్న దస్త్రాలను మరో గదిలోకి తరలించి తాత్కాలిక మరమ్మతులు చేయించి ఈ కోర్టు గదిని వినియోగించుకునేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ కోర్టు భవనం నుంచి ఆర్వోఆర్ అప్పీళ్లను, ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించేందుకు చర్యలు తీసుకోనున్నామని తెలిపారు. నిధులు మంజూరు కాగానే పనులు చేపట్టి కార్యాలయాన్ని పూర్తిస్థాయిలో వినియోగానికి తీసుకొస్తామని సబ్‌కలెక్టర్ చెప్పారు.



కార్యాలయంలోని ఆర్వోఆర్ కోర్టు భవనాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్

సీఐ తల్లి అదృశ్యంపై కేసు నమోదు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : ధర్మవరం ఒకటో పట్టణ సీఐగా పనిచేస్తున్న మదనపల్లెకు చెందిన నాగేంద్రప్రసాద్ తల్లి స్వర్ణకుమారి (60) అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు మదనపల్లె రూరల్ సీఐ కళా వెంకట రమణ తెలిపారు. సీఐ కథనం మేరకు.. మదనపల్లె మండలం జగన్‌కాలనీకి చెందిన స్వర్ణకుమారి ఇంట్లో ఒంటరిగా ఉంటోంది. ఆమె కుమారుడు ధర్మవరం ఒకటో పట్టణ సీఐగా పనిచేసున్నాడు. ఆమె గత నెల 29వ తేదీన ఉదయం 10 గంటల ప్రాంతంలో తమ ఇంటి ముందు ఉండే వెంకటేష్ అనే యువకుడితో కలసి పుంగనూరు రోడ్డులో ఉన్న మాంత్రికుడి వద్దకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆమె కుమారుడు సీఐ నాగేంద్రప్రసాద్ మదనపల్లెకు చేరుకుని గాలించారు. ఆమె ఆచూకీ దొరక్కపోవడంతో బుధవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆయన ఫిర్యాదు మేరకు మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. వెంకటేష్ బెంగళూరులో ఉద్యోగం చేస్తున్నట్లు గుర్తించి అతన్ని ఫోన్ ద్వారా విచారించారు. తాను ఆమెను పుంగనూరు రోడ్డులోని స్వామి వద్ద వదలి వచ్చినట్లు తెలిపాడు. దీనిపై విచారణ మొదలు పెట్టినట్లు సీఐ తెలిపారు. మహిళ ఆచూకీ తెలిసిన వారు తమకు సమాచారం ఇవ్వాలని సీఐ తెలిపారు.



స్వర్ణకుమారి (పాత చిత్రం)

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: పుంగనూరు-మదనపల్లె రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. పోలీసులు వివరాల మేరకు.. గత నెల 24న మదనపల్లె నుంచి పుంగనూరుకు వెళ్తున్న బొలేరో వాహనం పుంగనూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న ప్రైవేటు బస్సును ఢీ కొనడంతో కేవీపల్లె మండలం మినమరెడ్డిగారిపల్లెకు చెందిన బొలేరో డ్రైవర్ జి.కృష్ణమూర్తి (30) తీవ్రంగా గాయపడ్డారు. తిరుపతి స్విమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. సీఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



జి.కృష్ణమూర్తి (పాత చిత్రం)

'త్వరలో తెదేపా క్రియాశీల రాజకీయాల్లోకి'

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను జడ్జి రామకృష్ణ బుధవారం ఉండవల్లిలోని మంత్రి నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై మంత్రితో చర్చించినట్లు రామకృష్ణ తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో పని చేయడానికి నిర్ణయించుకున్నట్లు మంత్రికి తెలిపారు. పార్టీలో క్రియాశీలకంగా పనిచేయాలని నిర్ణయించుకున్నానని, జడ్జి పదవికి రాజీనామా చేయనున్నట్లు తెలిపారు. రాయలసీమలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అరాచకాలను అడ్డుకోవడానికి తన వంతుగా పోరాటం చేస్తానని తెలిపారు.



మంత్రి నారా లోకేశ్‌తో జడ్జి రామకృష్ణ

రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు మూడో స్థానం

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : పల్నాడు జిల్లా వినుకొండలో గత నెల 28 నుంచి 30వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి అండర్-17 బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా బాలికల జట్టు మూడో స్థానంలో నిలిచినట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు వసంత, బాబు, వసంతవాణి తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారిణులను, కోచ్‌లు మురళీధర్, మహేంద్రనాయక్, ఉమాదేవిలను వారు అభినందించారు.



ఉమ్మడి చిత్తూరు జిల్లా బాలికల అండర్-17 ఫుట్‌బాల్ జట్టుతో శిక్షకులు

ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం: జడ్జి



మాట్లాడుతున్న న్యాయమూర్తి మహేష్, పక్కన పోలీసులు

పీలేరు, న్యూస్‌టుడే: కారాగారంలో ఉన్న ఖైదీల్లో ఆర్థిక స్తోమత లేని వారికి ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని స్థానిక 11వ జిల్లా అదనపు న్యాయమూర్తి కె.మహేష్ అన్నారు. బుధవారం గాంధీ జయంతిని పురస్కరించుకుని న్యాయమూర్తి పీలేరు కారాగారాన్ని సందర్శించి ఖైదీల ఎదుట గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శిక్షలు ముగించుకుని బయటకు వెళ్లిన తరువాత వివాదాలు, కేసులకు దూరంగా ఉంటూ కుటుంబ సభ్యులకు దగ్గరగా జీవించడం అలవాటు చేసుకోవాలని ఇందువలన సమాజంలో కూడా మంచి పేరు వస్తుందని హితవు పలికారు. ప్రతి ఒక్కరూ గాంధీ అడుగుజాడల్లో నడవడం వల్ల సమాజం హింసకు దూరంగా ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో కారాగారం సూపరింటెండెంట్ చంద్రశేఖర్, న్యాయవాది షౌకత్ అలి, పీలేరు ఎస్సై బాలకృష్ణ పాల్గొన్నారు.

జాతీయ మానవ హక్కుల సంఘం సభ్యుడిగా జుబేర్

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ అండ్ సోషల్ జస్టిస్ సౌత్ ఇండియా ప్రెసిడెంట్‌గా తనను నియమించినట్లు పట్టణానికి చెందిన షేక్ జుబేర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్‌లో సంస్థ జాతీయ అధ్యక్షుడు గాజుల శ్రీనివాసరావు నుంచి నియామక పత్రం అందుకున్నట్లు ఆయన చెప్పారు.

నేరాలకు దూరంగా ఉండాలి

సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : వివిధ కేసుల్లో పట్టుబడి జైలుకు వచ్చిన ఖైదీల మనస్తత్వంలో మార్పు వచ్చి నేరాలకు దూరంగా ఉండాలని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్ అన్నారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా వారు వేర్వేరుగా ఖైదీలను పరామర్శించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తెలిసో, తెలియకో నేరాలు చేయడం వల్ల జైలు జీవితం అనుభవిస్తున్నారని దీని వల్ల కుటుంబాలు నాశనం అవుతాయన్నారు. ప్రజలు నేరాలకు దూరంగా ఉండాలన్నారు. ముగ్గురు ఖైదీలు ఏడాదిగా బెయిల్ పిటిషన్ వేసేందుకు ఎవరూ లేకపోవడంతో తాము జైలులోనే మగ్గుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. తాను సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని నేరాలు వదలి మంచి జీవితం గడపాలని ఆయన సూచించారు. అనంతరం ఖైదీలకు పండ్లు మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంట్ రామకృష్ణ యాదవ్‌తో పాటు సిబ్బంది ఉన్నారు.



మాట్లాడుతున్న మదనపల్లె ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లునాయక్

'ప్రధానమంత్రి జన్ జాతీయ ఉన్నత గ్రామ అభియాన్' గోడ పత్రాల ఆవిష్కరణ

రాయచోటి, న్యూస్‌టుడే: 'ప్రధానమంత్రి జన్ జాతీయ ఉన్నత గ్రామ అభియాన్' పథకం గిరిజన ప్రాంతాల సాధికారతకు తోడ్పడుతుందని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో గోడ పత్రాలు ఆవిష్కరించారు. పథకంలో 17 మంత్రిత్వ శాఖలు సమన్వయంతో 25 కార్యాచరణలు చేపట్టడం జరుగుతుందన్నారు. గిరిజన గ్రామాలకు విద్యుద్దీకరణ, రహదారుల సదుపాయం, అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటు వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని వివరించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి తేజస్విని, సిబ్బంది పాల్గొన్నారు.

న్యాక్ కేంద్రం... నిరుపయోగం

కలికిరి, (న్యూస్‌టుడే): కలికిరి జేఎన్‌టీయూఏ కళాశాలకు సమీపంలో గత పదిహేనేళ్ల కిందట అప్పటి ఎమ్మెల్యే నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రిగా వ్యవహరించిన సమయంలో ఇక్కడ న్యాక్ కేంద్రం ఏర్పాటుకు రెండెకరాల స్థలాన్ని కేటాయించారు. రూ.4 కోట్ల అంచనాలతో న్యాక్ కేంద్రం నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. అయితే అధికారం మారడంతో న్యాక్ కేంద్రం కట్టడాలు పిచ్చిమొక్కలు ఆవరించుకుని శిథిలావస్థకు చేరాయి. ఆ కేంద్రం కట్టడాల పక్కనే బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు సాగుతుండడంతో అందులో కొంతభాగం రోడ్డు నిర్మాణం సాగుతోంది. ఈ కేంద్రం మంజూరు చేసిన మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి కేంద్రంలో అధికారంలో ఉన్న భాజపా పాలనలో ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా, ఆయన సోదరుడు నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి కూటమి ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఈ కేంద్రం తిరిగి పునరుద్ధరణపై ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి.



లాక్రోస్ ఆట... విజయాల బాట

సత్తా చాటుతున్న పల్లెటూరి చిన్నారులు
జాతీయస్థాయి పోటీలకు సీటీఎం విద్యార్థులు

అదో సరికొత్త ఆట... అందులో జాతీయ స్థాయిలో సత్తా చాటడం అంటే మాటలా..? కానీ ఆ విద్యార్థులు నిరంతర శ్రమతో సత్తా చాటారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయిలో పతకాల పంట పడిస్తూ ఏకంగా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గత ఏడాది సరికొత్తగా ప్రారంభించిన లాక్రోస్ ఆటలో సత్తా చాటుతున్న మదనపల్లె మండలం సీటీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల ఉదంతం ఇది. వ్యాయామోపాధ్యాయులు నాగరాజు, నరేష్‌ల శిక్షణలో విద్యార్థులు క్రీడల్లో మెరికల్లా తయారౌతున్నారు. ఇటీవల కర్నూలులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాఠశాల విద్యార్థులు ఇద్దరు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆగ్రాలో జరిగే ఈ పోటీలకు మదనపల్లె నుంచి రాష్ట్రజట్టులో చోటు సాధించారు. గత ఏడాది ఇద్దరు విద్యార్థులు ఎంపిక కాగా ఈ ఏడాది మరో ఇద్దరు ఎంపికయ్యారు. పల్లె నుంచి మొదలై దిల్లీలో మదనపల్లె సత్తా చాటేందుకు విద్యార్థులు నైపుణ్యాలకు మెరుగులు దిద్దుకుంటూ అందరి చేత ప్రశంసలు అందుకుంటున్నారు.



లాక్రోస్ ఆడుతున్న క్రీడాకారులు

ఉన్నత స్థాయిలో రాణించడమే లక్ష్యం



చదువుతో పాటు ఆటలపై ఇష్టం ఉండటంతో అమ్మా, నాన్న రెడ్డిప్రసాద్, నాగరత్నల ప్రోత్సాహంతో ఆటలపై ఆసక్తి పెంచుకున్నాను. పాఠశాలలో లాక్రోస్‌తో పాటు హాకీలో ప్రావీణ్యం సాధించాను. ఇటీవల కర్నూలు జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాను. ఉదయం, సాయంత్రం వ్యాయామోపాధ్యాయులు నాగరాజు, నరేష్‌ల ద్వారా ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నాను. అంతర్జాతీయ స్థాయి క్రీడాకారుడిగా ఎదగడమే లక్ష్యంగా పెట్టుకున్నాను.

- రెడ్డి జయప్రకాష్, 10వ తరగతి, జడ్పీహెచ్ఎస్, సీటీఎం, మదనపల్లె

పోలీసు అవ్వాలనే ఆటల్లో రాణిస్తున్నా



నాకు చిన్నప్పటి నుంచి పోలీసు కావాలన్నది లక్ష్యం. అందుకే అమ్మా, నాన్న ఆనంద్, రెడ్డినాగజ్యోతిల ప్రోత్సాహంతో వ్యాయామోపాధ్యాయుల సహకారంతో లాక్రోస్ ఆటలో రెండేళ్లుగా శిక్షణ తీసుకుంటున్నా. గత ఏడాది జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కాలేకపోయాను. ఈ ఏడాది దానిపై మరింత పట్టు పెంచుకుని శిక్షణ తీసుకోవడంతో కర్నూలులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపాను. దీంతో రాష్ట్రజట్టులో స్థానం లభించింది. జాతీయ స్థాయిలో సత్తా చాటి ప్రతిభ చూపాలన్నదే లక్ష్యంగా పెట్టుకున్నాను.

- వెంకటసాయి, 10వ తరగతి, జడ్పీహెచ్ఎస్, సీటీఎం, మదనపల్లె

మదనపల్లె

•మదనపల్లె • పీలేరు • తంబళ్లపల్లె



పీలేరులో రక్తదానం చేస్తున్న యువకులు

దానాల్లో రక్తదానం మిన్న

పీలేరు, న్యూస్‌టుడే: అన్ని దానాల్లో కెల్లా రక్తదానం మిన్న అని ఆరోగ్యంగా ఉన్న యువకులు ఆరు నెలలకో మారు రక్తదానం చేయడానికి అవకాశం ఉంటుందని పీలేరు వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం పీలేరు ప్రభుత్వ వైద్యశాలలో లయన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షులు మహేష్, ఆశోక్, సురేంద్ర నాథరెడ్డి, నాగబాలాజీ, చెంగయ్య పాల్గొన్నారు.

పార్కులో స్వచ్ఛభారత్

మదనపల్లె పట్టణం: పట్టణంలోని రామ్‌నగర్ పార్కును పురపాలక అధికారులు, కౌన్సిలర్లు శుభ్రం చేశారు. స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమ ముగింపులో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ మనూజ మాట్లాడుతూ... గత నెల 14వ తేదీ నుంచి పురపాలక సంఘం పరిధిలో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా నిర్వహించామని తెలిపారు. కమిషనర్ ప్రమీల, కౌన్సిలర్లు సుగుణమ్మ, ప్రసాద్, రేణుక పాల్గొన్నారు.



రామ్‌నగర్ పార్కును శుభ్రం చేస్తున్న ఛైర్‌పర్సన్ మనూజ, కౌన్సిలర్లు, అధికారులు

మేమున్నాం... మీకు తోడుగా...

(10 AM to 1 PM)
మదనపల్లె : 8008574611
పీలేరు : 8008574958
తంబళ్లపల్లె : 8008574612

న్యూస్‌టుడే, మదనపల్లె నేరవార్తలు

?: మదనపల్లె పట్టణంలోని నీరుగట్టువారిపల్లెలోని వాటర్ ప్లాంటు వెనుక వైపున ఉన్న చెరువు కట్టపై మద్యం తాగే వారు ఎక్కువగా ఉంటున్నారు. దీంతో ఆ దారిలో పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు? - జయచంద్ర, నీరుగట్టువారిపల్లె, మదనపల్లె

✔: బహిరంగంగా మద్యం తాగే వారిపై కేసులు నమోదు చేస్తాం. ఫిర్యాదు వచ్చిన మార్గంపై నిఘా ఉంచుతాం. - చాంద్‌బాషా, సీఐ, ఒకటోపట్టణ స్టేషన్, మదనపల్లె

?: మదనపల్లెలోని నిమ్మనపల్లె కూడలిలో హైమాస్ట్ లైట్లు పని చేయడం లేదు. ఈ ప్రాంతంలో అంధకారంగా నెలకొంది. పాదచారులు ఇబ్బందికరంగా ఉంది? - వెంకటరమణ, నిమ్మనపల్లె కూడలి, మదనపల్లె

✔: లైట్లు మరమ్మతులు చేసి ఇబ్బంది లేకుండా చేస్తాం. - ప్రమీల, మున్సిపల్ కమిషనర్, మదనపల్లె

?: మదనపల్లె పట్టణంలోని బిసెంట్ కూడలిలో పెద్ద సిమెంటు లారీలు రావడం వల్ల తరచూ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. దీని వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది? చర్యలు తీసుకోవాలి? - చంద్రరాజు, మదనపల్లె

✔: ఈ ప్రాంతంలో పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసి ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకుంటాం. - చాంద్‌బాషా, సీఐ ఒకటో పట్టణ స్టేషన్, మదనపల్లె

?: కలికిరి మండలం అద్దవారిపల్లె పంచాయతీ కొత్తపల్లెలోని వీధుల్లో మురుగు నిల్వ ఉండటంతో పారిశుద్ధ్యం లోపించి దుర్వాసన వస్తోంది? - మస్తాన్, స్థానికుడు

✔: మురుగు నీరు తొలగించి వీధులను శుభ్రం చేయించేందుకు చర్యలు చేపడతాం. - అఫీఫా, కార్యదర్శి, అద్దవారిపల్లె. - న్యూస్‌టుడే, కలికిరిగ్రామీణ

?: మండల కేంద్రమైన కలకడలోని రాజీవ్‌నగర్‌లో మురుగు కాలువలో అపరిశుభ్రంగా ఉంది? చెత్తచేరి మురుగు నిల్వ ఉంటోంది? - మహబూబ్‌బాషా, కలకడ

✔: మురుగు కాలువను శుభ్రం చేయించి, దోమలు లేకుండా చర్యలు తీసుకుంటాం. - దేవేంద్ర, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, కలకడ

?: మండలంలోని ఎంపీపల్లె పంచాయతీ గుండ్రేవారిపల్లెకు సమీపంలో ఉన్న ఆరోగ్య ఉపకేంద్రం ఆవరణలో పిచ్చి మొక్కలు తొలగించాలి? - సుధాకర్, స్థానికుడు

✔: పిచ్చి మొక్కలు తొలగిస్తాం. - పురుషోత్తం, ఆరోగ్య పర్యవేక్షకులు - న్యూస్‌టుడే, కంభంవారిపల్లె

చెక్‌డ్యాం ధ్వంసంపై ఫిర్యాదు

నిమ్మనపల్లె: మండలంలోని వెంగంవారిపల్లె పంచాయతీ పరిధిలో ప్రజల కోసం నిర్మించిన చెక్‌డ్యాంను కొందరు వ్యక్తులు ధ్వంసం చేశారని మరికొంత భూమిని ఆక్రమించుకున్నారని నాగంవారిపల్లెకు చెందిన గెలసం రామచంద్రారెడ్డి మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు ఫిర్యాదు చేశారు. బుధవారం ఎమ్మెల్యే సిమెంటు రహదారుల భూమి పూజకు వచ్చిన సమయంలో రామచంద్రారెడ్డి చెక్‌డ్యాం విషయమై ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. వెంటనే ఘటనా స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించి రెవెన్యూ అధికారులు, జలవనరులశాఖ ఏఈ శ్రీహరిరెడ్డిని పిలిచి వాస్తవాలు విచారించాలని ఆదేశించించారు.

భర్త ఆచూకీ తెలపండి

పెద్దమండ్యం, న్యూస్‌టుడే: తన భర్త ఆచూకీ తెలపాలని పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేసిన ఘటన పెద్దమండ్యం మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... మండలంలోని రామానాయక్‌తాండాకు చెందిన శిరీష (28) హరినాయక్‌ను (34) వివాహం చేసుకుంది. వీరికి ముగ్గురు పిల్లలున్నారు. ఇటీవల జూదానికి బానిసై డబ్బులు అప్పులు చేశాడని, దీంతో ఇంటి నుంచి వెళ్లిపోయాడని, ఎక్కడ ఉన్నాడో తెలియడం లేదని, ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉందని ఆచూకీ తెలపాలని బుధవారం పెద్దమండ్యం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్.ఐ. రమణ తెలిపారు.

పేదల ఇళ్లు కూల్చడం అన్యాయం


ములకలచెరువు, న్యూస్‌టుడే: ములకలచెరువులో ముస్లింల ఇళ్లను కూల్చడం దారుణమని జాతీయ ఏసీబీఐ ఇన్‌ఛార్జి సయ్యద్ మీర్ సాహెబ్, కదిరి కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు ఆరీఫ్ అలీ పేర్కొన్నారు. బుధవారం ములకలచెరువులో ఏర్పాటు సమావేశంలో వారు మాట్లాడుతూ... పోలీసులు అక్రమంగా ఇళ్లు కూల్చివేశారన్నారు. ఈ స్థలానికి రెవెన్యూ అధికారులు బాధితుడైన ఫక్రుద్దీన్‌కు గతంలో పట్టా ఇచ్చారని, పాసు పుస్తకం, వన్‌బీ కూడా ఉన్నాయన్నారు. ఈ స్థలంలోకి అక్రమంగా ప్రవేశించి దౌర్జన్యంగా కట్టడం తొలగించారని పేర్కొన్నారు. అక్రమంగా తొలగించిన రెవెన్యూ, పోలీసులపై న్యాయపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

దారి సమస్యకు పరిష్కారం



కల్వర్టు నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహిస్తున్న సర్పంచి చలపతి, నాయకులు

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: కొన్నేళ్లుగా వంకపై వంతెన లేక ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారని, దీన్ని దృష్టిలో పెట్టుకుని వంతెన నిర్మాణం చేపడుతున్నట్లు కురవంక సర్పంచి చలపతి చెప్పారు. బుధవారం రూ.10 లక్షల అంచనాతో పంచాయతీలోని కురవంకపై వంతెన నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించారు. పంచాయతీ నిధులతో ఈ వంతెన నిర్మిస్తున్నట్లు సర్పంచి పేర్కొన్నారు. కొన్నేళ్లుగా ఈ ప్రాంతంలో ప్రజలు వర్షాలు కురిస్తే వంకలో నీరు ప్రవహిస్తుందని, దీంతో దారి సమస్యను పరిష్కరించేందుకు ఈ నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. ప్రజలకు అవసరమైన ప్రాంతాల్లో మురుగు కాలువలు, రోడ్ల నిర్మాణాలపై దృష్టి పెడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



గాంధీజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, ఛైర్‌పర్సన్ మనూజ, అధికారులు



మదనపల్లెలో మహాత్ముడి విగ్రహానికి వందనం సమర్పిస్తున్న సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్, రెవెన్యూ అధికారులు



పీలేరులో గాంధీజీ విగ్రహం ఎదుట ఆర్యవైశ్య సంఘం సభ్యులు

మహాత్మా... సదా స్మరామి





బి.కొత్తకోటలో గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు



వాల్మీకిపురంలో జాతిపిత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బార్ అసోసియేషన్ నాయకులు

స్వాతంత్ర్యం కోసం గాంధీజీ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిలో నిలిచిపోతుందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. బుధవారం మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో గ్రామగ్రామాల మహాత్ముడి జయంతిని ఘనంగా నిర్వహించారు. పురపాలక సంఘం కార్యాలయంలో వేడుకలకు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా గాంధీ కూడళ్లలో ఉన్న మహాత్ముడి విగ్రహాలను అందంగా పూలతో అలంకరించి నివాళులు అర్పించారు. పురపాలక ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహానికి ఛైర్‌పర్సన్ వి.మనూజ, కౌన్సిలర్లతో కలసి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఆర్యవైశ్య సంఘ ప్రముఖులు, వివిధ పార్టీల నాయకులు, ప్రభుత్వ కార్యాలయాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన చూపిన మార్గంలో పయనించి దేశాన్ని అభివృద్ధి పథం వైపు నడించుకుందామని పిలుపునిచ్చారు. బి.కొత్తకోట పాత ఆర్టీసీ డిపో ఆవరణలో గాంధీతో పాటు మాజీ ప్రధానమంత్రి లాల్‌బహదూర్‌శాస్త్రిల జయంతిని పురస్కరించుకుని వారి చిత్రపటాలకు వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. స్వచ్ఛత రాయబారులుగా గాంధీ బాటలో నడుస్తున్న వారి సేవలను కొనియాడారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల చిత్రాలివి. - న్యూస్‌టుడే, మదనపల్లె క్లస్టర్ బృందం



రామసముద్రం సచివాలయంలో మహాత్ముడి చిత్రపటం ముందు నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, తెదేపా నాయకులు

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: గ్రామాల్లో పరిసరాలు శుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని డీఎల్‌డీవో లక్ష్మీపతి పేర్కొన్నారు. గ్రామీణ మండలం ఈశ్వరమ్మ కాలనీ పంచాయతీ పరిధిలోని చెంబకూరు రోడ్డులో ఎంపీడీవో మస్తాన్‌వల్లి ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం నిర్వహించారు. కాలువలు శుభ్రం చేసి చెత్తదిబ్బలు దూరంగా తరలించారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని గ్రామ పంచాయతీ పరిధిలోని పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం చేశారు. అదే విధంగా మండలంలోని అన్ని గ్రామాల్లో పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు గ్రామసభలు నిర్వహించారు. గ్రామాభివృద్ధి చేపట్టాల్సిన పనులపై చర్చించారు. పలు పనులకు ప్రతిపాదనలు పెట్టారు. కార్యక్రమంలో పంచాయతీ అధికారులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

గుర్రంకొండ: ఆరోగ్యంగా జీవించాలంటే ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతలో భాగస్వామ్యులు కావాలని సప్తగిరి గ్రామీణ బ్యాంకు రీజనల్ మేనేజర్ ప్రకాష్ రతన్‌బాబు పేర్కొన్నారు. బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా ఆయన కళాశాల ఆవరణం శుభ్రత కార్యక్రమంలో పాల్గొని పిచ్చి మొక్కలు తొలగించారు. అనంతరం మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ వారివారి పుట్టిన రోజున ఒక మొక్కనాటి దాన్ని సంరక్షిస్తే కోట్లాది మొక్కలు పెరుగుతాయన్నారు. స్వచ్ఛమైన గాలి పీల్చడం వల్ల ఆరోగ్యంగా అభివృద్ధి చెందుతారన్నారు. బ్యాంకు మేనేజర్ వంశీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

కలకడ: మండలంలోని ఆయా పంచాయతీలలో ఉపాధి హామీ పథకం గ్రామసభలను పంచాయతీల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కూలీలకు సరిపడా పనులు గుర్తించి, ప్రణాళికలు తయారు చేయడానికి పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం సిబ్బంది, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొని పనుల ఎంపిక చేశారు. కార్యక్రమంలో సమన్వయాధికారులు ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డి, ఈవోఆర్‌డీ లతీఫ్‌ఖాన్, ఏపీవో చెన్నకేశవులు, ఏఈలు ఇరగన్న, రమణయ్య, ఎంఈవోలు మునీంద్రనాయక్, రామచంద్రారెడ్డి, స్వర్ణలత, సిబ్బంది పాల్గొన్నారు.



కలకడ మండలం గుడిబండలో గ్రామసభ నిర్వహిస్తున్న పంచాయతీ, ఉపాధిహామీ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు



మదనపల్లె మండలం ఈశ్వరమ్మ కాలనీలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న డీఎల్‌డీవో లక్ష్మీపతి, సిబ్బంది

గ్రామాలకు సీసీ రహదారులు: ఎమ్మెల్యే



పెద్దరాజులపల్లెలో సీసీ రహదారి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

నిమ్మనపల్లె, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని మదనపల్లె నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు సిమెంటు రహదారులు, తాగునీరు, మురుగు కాలువలు నిర్మించి తెదేపా సత్తా చాటుతామని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. బుధవారం నిమ్మనపల్లె మండలంలోని పెద్దరాజుల పల్లె, తవళం ఉంటావారిపల్లెలో సిమెంటు రహదారులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... తెదేపా వందరోజుల పాలనలోనే ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు పెద్దపీట వేసిందన్నారు. గ్రామస్థాయిలో సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎక్కువ చొరవ చూపుతున్నారన్నారు. వైకాపా పాలనలో ఎక్కడా సిమెంటు రహదారులు వేసిన పాపాన పోలేదని ప్రజలు సమస్యలు ప్రస్తావించడానికే భయపడేవారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు పాపులమ్మ, రెడ్డెప్ప, తెదేపా నాయకులు పుర్రా వెంకటరమణ, రాజన్న, సుధాకర్‌రావు, మల్లప్ప, రెడ్డెప్పరెడ్డి, లక్ష్మన్న, శ్రీపతి, ఖాసింఖాన్, షఫి, మహ్మద్‌రఫి, శంకరయ్య, రెడ్డెప్ప, నాగరాజనాయుడు, చెంద్రాయుడు, విజయ్, జనసేన నాయకులు ఈటకట్ట చంద్రశేఖర్, అఫ్రోజ్ ఖాన్ పాల్గొన్నారు.

శుద్ధ జల కేంద్రం ప్రారంభం

మదనపల్లె వైద్యం : మదనపల్లె ప్రభుత్వ సర్వజన బోధన ఆసుపత్రిలో బెంగళూరుకు చెందిన ఎన్‌వీ రావ్ బ్రాండ్స్ సంస్థ వితరణగా ఇచ్చిన ఆర్వో ప్లాంట్‌ను బుధవారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రారంభించారు. రోగులు తాగునీటికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆర్వో నీరు సరఫరా చేయాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్ రాజుకు సూచించారు. అనంతరం ఆసుపత్రి పైభాగంలో నిర్మించిన గదులను పరిశీలించారు. చాలా వరకు గదులు వర్షానికి తడిచిపోయి ఉండటంతో డీఈ కరీముల్లాఖాన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. చుక్క నీరు ఆసుపత్రి ఆవరణలోకి వచ్చినా ఒప్పుకునేది లేదని రెండు రోజుల్లో సమస్య పరిష్కరించాలని ఆయన సూచించారు. ఎమ్మెల్యేతో పాటు వైద్య సిబ్బంది ఉన్నారు.

గణితంపై భయాల్ని పోగొట్టేలా బోధించాలి



మాట్లాడుతున్న ఏపీ గణిత ఫోరం నాయకులు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : విద్యార్థులకు గణితంపై ఉన్న భయాల్ని పోగొట్టేలా బోధన చేయాలని గణిత ఫోరం రాష్ట్ర ప్రతినిధి శంకర్ నారాయణరెడ్డి అన్నారు. బుధవారం ఏపీఎంఎఫ్ ఆధ్వర్యంలో మదనపల్లె డివిజన్‌లోని గణిత ఉపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మారిన పాఠ్యాంశాలకు అనుగుణంగా ఉపాధ్యాయులు అవగాహన పెంచుకోవాలన్నారు. పదో తరగతి పాఠ్య పుస్తకంపై విశ్లేషణ చేశారు. ప్రతి విద్యార్థి పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించేలా విద్యాబోధన చేయాలని అన్నారు. అనంతరం 2023లో గణితంలో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు, ఉత్తమ గణిత ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో ఏపీఎంఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నామా చంద్రశేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరుణ శివప్రసాద్, జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, జిల్లా ఫైనాన్స్ కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి భాస్కర్‌తో పాటు డివిజన్‌లోని 120 మంది గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేలకొరిగిన విద్యుత్తు స్తంభం



తెట్టు (కురబలకోట), న్యూస్‌టుడే : మండలంలో బుధవారం సాయంత్రం కురిసిన వర్షం కారణంగా తెట్టు పంచాయతీలోని మండ్యంవారిపల్లెలో విద్యుత్తు స్తంభం నేలకొరిగింది. వర్షం పడుతున్న సమయంలో స్తంభం నేలకు ఒరగడంతో ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిపోయింది. స్తంభం పడిపోవటాన్ని గమనించిన స్థానికులు విద్యుత్తుశాఖ అధికారులకు సమాచారం అందించి, సరఫరాను నిలిపి వేయించారు.

రూ.కోట్లు దుర్వినియోగం... ప్రగతికి ఆటంకం

● జిల్లాలో అతి పెద్ద పంచాయతీ దుస్థితి ● గాడిన పడని పరిపాలనతో తప్పని ఇక్కట్లు

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే : జిల్లాలో అతిపెద్ద పంచాయతీ, అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న పీలేరులో పంచాయతీ పాలన గాడిన పడడం లేదు. పంచాయతీలో 20 వార్డులుండగా 50 వేల జనాభా ఉంది. సరాసరి ఆదాయం ఆర్థిక సంఘం, గ్రాంటులు, ప్రత్యేక నిధులు కాకుండా రూ.4 కోట్ల పైమాటే. ఇద్దరు వైకాపా సర్పంచుల ధనదాహంతో పంచాయతీలో అవినీతి తారాస్థాయికి చేరుకుంది. తొలుత హబీబ్‌బాషా పీలేరు సర్పంచిగా రెండన్నరేళ్లు కొనసాగగా ఆయన కాలంలో ఒక పర్యాయం రూ.43,25,379, రెండో పర్యాయం రూ.37,48,805 పంచాయతీ నిధులు అవినీతికి పాల్పడినట్లు అధికారులు తేల్చారు. ఈయన అనంతరం ఉప సర్పంచిగా ఉన్న జీనత్ షఫీ ఇన్‌ఛార్జి సర్పంచిగా అవినీతిలో పోటీ పడ్డారు. ఈమె తొలిసారిగా రూ.5,33,710 రెండో పర్యాయం రూ.19,17,910, మూడో పర్యాయం రూ.35,09,020 నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారు. ఇలా ఈ ఇద్దరు కలిసి రూ.1,40,43,714 నిధులు పక్కదారి పట్టడానికి కారకులయ్యారు. అంతటితో ఆగకుండా ఈ ఇరువురు పంచాయతీని అప్పుల్లోకి నెడుతూ ఏకంగా రూ.3 కోట్ల మేరా అప్పులు చూపించారు.

పంచాయతీ	: పీలేరు
వార్డులు	: 20
జనాభా	: 50 వేలు
వార్షికాదాయం	: రూ.4 కోట్లకుపైగానే

అటకెక్కిన ప్రగతి పనులు...

గత వైకాపా సర్కారులో పాలనలో పంచాయతీలోని పాలకులకు, అధికారులు అంటకాగారు. అభివృద్ధి పేరిట నిధులు పక్కదారి పట్టించి రూ.కోట్లలో అవినీతికి పాల్పడ్డారు. చేయని పనులకు బిల్లులు చేసుకున్నారు. అరకొరగా చేసిన పనుల్లో నాణ్యత లోపించినా అడిగే వారు లేకపోయారు. పాలనను గాలికొదిలేశారు. దీంతో కాలనీల్లో మౌలిక సదుపాయాలు జాడ కన్పించలేదు.

● పట్టణంలోని పలు వీధుల్లో నేటికీ సరైన సదుపాయాలు లేవు. సిమెంటు కాంక్రీటు రోడ్లు లేకపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. చిన్న వర్షం కురిసినా సీసీ రహదారులు, కాలువలు లూక వీధులు జలమయం అవుతున్నాయి. చెత్తాచెదారం, వ్యర్థాలు రోడ్లపైనే దర్శనమిస్తాయి.

● పంచాయతీలో భారీగా అవినీతి జరిగినట్లు గుర్తించి పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆయన చొరవతో జిల్లాస్థాయి ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో ఇక్కడ ఇద్దరి సర్పంచులు అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించి చెక్ పవర్ రద్దు చేశారు. ఈవోలుగా పనిచేసిన వారిలో ఒకరు సస్పెన్షన్‌కు గురవగా, మరో ఇద్దరికి షోకాజు నోటీసులు జారీ చేశారు.



కోటపల్లె మార్గంలో రోడ్డుపై పారుతున్న మురుగు

గాడిన పెడుతున్నాం

అవినీతితో నిండిపోయిన పంచాయతీలో అన్ని విభాగాల ప్రక్షాళన దిశగా చర్యలు తీసుకున్నాం. పాలనను గాడిన పెడుతున్నాం. జవాబుదారీతనంగా పాలన ఉండేటట్లు చర్యలు తీసుకుంటున్నాం. త్వరలో పరిస్థితులను చక్కదిద్ది ప్రగతి దారిన పంచాయతీని నడిపిస్తాం.

- గురుమోహన్, ఈవో, పీలేరు

6న చలో రాయచోటి

రామసముద్రం: రామసముద్రం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో బుధవారం 'చలో రాయచోటి' పోస్టర్లను మాల మహానాడు సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ నెల 6వ తేదీ జరిగే ఎస్సీ వర్గీకరణ, ఎస్సీ, ఎస్టీల పట్ల జరుగు క్రిమిలేయర్ వ్యతిరేక సభలను జయప్రదం చేద్దామని కోరారు. మండలంలోని దళితులు సభకు తరలివచ్చి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. సంఘం మండల అధ్యక్షుడు కృష్ణప్ప, జడ్పీటీసీ మాజీ సభ్యుడు శివశంకర్, సంఘ సభ్యులు నాగరాజు, బాలాజీ, చంద్రప్ప, శేషాద్రి, చంద్రప్ప, నరసింహులు పాల్గొన్నారు.

వెలుగు ఏపీఎం మృతికి సంతాపం

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎంగా పని చేస్తున్న ఎం.రవికుమార్ (54) అనారోగ్యంతో బుధవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మూడు రోజుల కిందట బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో ఆయన్ను తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఇటీవలే ఆయన చిట్వేలి మండలానికి బదిలీ అయ్యారు. అక్కడ చేరకముందే అనారోగ్యంతో మృతి చెందడం పట్ల వెలుగు సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

'ప్రధానమంత్రి జన్ జాతీయ ఉన్నత గ్రామ అభియాన్' గోడ పత్రాల ఆవిష్కరణ

రాయచోటి, న్యూస్‌టుడే: 'ప్రధానమంత్రి జన్ జాతీయ ఉన్నత గ్రామ అభియాన్' పథకం గిరిజన ప్రాంతాల సాధికారతకు తోడ్పడుతుందని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో గోడ పత్రాలు ఆవిష్కరించారు. పథకంలో 17 మంత్రిత్వ శాఖలు సమన్వయంతో 25 కార్యాచరణలు చేపట్టడం జరుగుతుందన్నారు. గిరిజన గ్రామాలకు విద్యుద్దీకరణ, రహదారుల సదుపాయం, అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటు వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని వివరించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి తేజస్విని, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ మానవ హక్కుల సంఘం సభ్యుడిగా జుబేర్



జాతీయ అధ్యక్షుడు శ్రీనివాసరావు నుంచి నియామక పత్రం అందుకుంటున్న జుబేర్

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ అండ్ సోషల్ జస్టిస్ సౌత్ ఇండియా ప్రెసిడెంట్‌గా తనను నియమించినట్లు పట్టణానికి చెందిన షేక్ జుబేర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్‌లో సంస్థ జాతీయ అధ్యక్షుడు గాజుల శ్రీనివాసరావు నుంచి నియామక పత్రం అందుకున్నట్లు ఆయన చెప్పారు.

విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే ఉంచాలి



రిలే నిరాహార దీక్షలు చేస్తున్న విద్యార్థి, కార్మిక సంఘాల నాయకులు

రాయచోటి, న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకుని ప్రభుత్వ రంగంలోనే ఉంచాలని కోరుతూ బుధవారం విద్యార్థి సంఘాలు, రైతు, కార్మిక సంఘ నేతలు కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలు చేశారు. నష్టాల్లో ఉన్న వైజాగ్ స్టీల్ పరిశ్రమకు నిధులు కేటాయించి ఆదుకోవాలన్నారు. విధుల నుంచి తొలగించిన 4 వేల మంది కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి హామీ ఇవ్వకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, ఉపాధ్యక్షుడు రవి కుమార్, సీపీఐఎంఎల్ నాయకులు, ఇతర కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

చిన్నమండెంలో స్వచ్ఛభారత్ దివస్



ప్లాస్టిక్ కవర్లు వాడద్దంటూ ప్రచారం చేస్తున్న అధికారులు

చిన్నమండెం, న్యూస్‌టుడే: చిన్నమండెంలో గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛభారత్ దివస్ కార్యక్రమాన్ని ఎంపీడీవో దివ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ప్లాస్టిక్ వాడకాన్ని ఆపేద్దామంటూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ప్రతి దుకాణం దగ్గర ప్లాస్టిక్ సంచులు ఆపేద్దాం.. వస్త్రాల సంచులు వాడదామంటూ ప్రచారం చేశారు. ప్లాస్టిక్ వాడకంతో కలిగే నష్టాలను ప్రజలకు వివరిస్తూ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి పవన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: రహదారి ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మంచానికి పరిమితమైన మృకుండాశ్రమం నివాసి సాయి మధుసూదన్ కుటుంబానికి సిద్దవటం మండలం మాధవరం-1కు చెందిన మన ఊరి కోసం స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధుల ఆధ్వర్యంలో బుధవారం ఆర్థిక సాయం చేశారు. సంస్థ ఛైర్మన్ అవ్వారు రవిశంకర్ దాతల సహకారంతో రూ.10 వేలు విలువ చేసే నిత్యావసర సరకులు, మరో రూ.17,700 నగదును అందజేశారు. రామకృష్ణ, సుధీర్, శివారెడ్డి పాల్గొన్నారు.

మంత్రివర్యా...

ప్రైవేటు వాహనదారులకు పార్కింగ్‌గా మారిన వైనం

గడ్డిమేత స్థలం వైపు చూడండయ్యా..!

\- న్యూస్‌టుడే, రాయచోటి

జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణ నడిబొడ్డున రూ.కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులు అన్యాక్రాంతమవుతున్నాయి. 2016-18 మధ్య అప్పటి తెదేపా ప్రభుత్వం రాయచోటి పట్టణంలో వెలికితీసిన గడ్డిమేత స్థలాన్ని పురపాలక సంఘం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అప్పటి కలెక్టర్ హరికిరణ్ ఆదేశాలపై అధికారులు ఆక్రమణలు తొలగించి స్థలం స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం పార్కు నిర్మాణానికి హామీ ఇచ్చినా ఇంతవరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. రూ.70 కోట్ల విలువైన ఆ స్థలం నేడు జాతీయ రహదారి పక్కన ప్రైవేటు వాహనాలకు పార్కింగ్ కేంద్రంగా మారిపోయింది.

★ సుమారు 57 సెంట్ల విస్తీర్ణంలో ఉన్న గడ్డిమేత స్థలం చుట్టూ అధికారులు కంచెను ఏర్పాటు చేశారు. పార్కు నిర్మించాలని పురపాలక సంఘం తీర్మానం చేసింది. పాలక పక్షంలోని కొందరు నిధుల విడుదలకు అడ్డంకిగా మారడంతో ఉమ్మడి కడప జిల్లా కలెక్టర్‌గా ఉన్న హరికిరణ్ జిల్లా అభివృద్ధి నిధుల నుంచి రూ.70 లక్షలు మంజూరు చేశారు. ఆ నిధులతో వెంటనే



ప్రైవేట్ వాహనాలకు స్టాండుగా మారిన రూ.70 కోట్ల విలువైన గడ్డిమేత స్థలం

పార్కు నిర్మాణ పనులు చేపట్టాలని ఆదేశించినా. పట్టణ ప్లానింగ్ అధికారులు డీపీఆర్‌ను రూపొందించి వదిలేశారు. పాలకులు పార్కు నిర్మాణంపై దృష్టిసారించకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పనులు ఆగిపోయాయి. పార్కు నిర్మాణం కోసం మంజూరైన రూ.70 లక్షల నిధులు ఏమయ్యాయో కూడా తెలియని పరిస్థితి నెలకొంది.. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గడ్డిమేత స్థలంలో పార్కు నిర్మాణంపై పాలకులు దృష్టి సారించేవిధంగా ప్రజా సంఘాల నేతలు ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందని పురవాసులు కోరుతున్నారు.

★ పురపాలక సంఘం అధికారులు 2018-19లో సుమారు రూ.20 లక్షలతో వెచ్చించి గడ్డిమేత స్థలం చుట్టూ కంచె ఏర్పాటు చేశారు. దీనిని తొలగించి ప్రైవేటు వాహనదారులు స్టాండుగా మార్చుకున్నారు. ఇక్కడే భవన నిర్మాణ వ్యర్థాలు పారబోస్తున్నారు. తోపుడు బండ్లు, ఇతర వ్యాపారులు స్థలాన్ని ఆక్రమించి అంగళ్లు ఏర్పాటు చేసుకున్నారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి క్యాంపు కార్యాలయానికి పది మీటర్ల దూరంలోనే స్థలం ఉంది. పురపాలక సంఘం అధికారులతో సమీక్షించి ఆక్రమణల తొలగింపుతో పాటు ఉన్న నిధులతోనే పార్కు లేదా ఇతర ప్రజా ప్రయోజనాలకు స్థలాన్ని వినియోగించేవిధంగా చూడాల్సిన బాధ్యత మంత్రిపై ఉంది.

కంచె తొలగిస్తే కేసులు నమోదు చేస్తాం

గడ్డిమేత స్థలం అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. నిధుల పరిస్థితి కొలిక్కి రాగానే పనులు చేపట్టి పార్కు ఏర్పాటు చేస్తాం. కంచె తొలగించే వారిపై కేసులు నమోదు చేయించి కఠిన చర్యలు తీసుకుంటాం. పార్కు స్థలంలోని ప్రైవేటు వాహనాలు తొలగించాలని ఇప్పటికే ఆదేశాలిచ్చాం.

\- వాసుబాబు, కమిషనర్, రాయచోటి

ఉపాధిహామీ పథకం అనుసంధానంతో అభివృద్ధి పనులు



మాట్లాడుతున్న ఎంపీడీవో రామచంద్ర

సుండుపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి నిధుల అనుసంధానంతో పల్లెల్లో రహదారులు, సిమెంట్ రహదారులు వంటి అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తోందని ఎంపీడీవో ఎన్.రామచంద్ర తెలిపారు. సుండుపల్లిలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. జిల్లాకు స్వచ్ఛత హీ సేవా పురస్కారం లభించడం ఆనందదాయకమన్నారు. తెదేపా నాయకులు వై.శివరామిరెడ్డి, ఎం.శివరాంనాయుడు, భాజపా నాయకుడు టి.రామజగదీష్, జనసేన నాయకుడు రామాశ్రీనివాసులు పాల్గొన్నారు.

వీరబల్లి: అర్హులకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో గ్రామ సభల ద్వారా పనులు గుర్తించిందని మట్లి సర్పంచి సోమారపు నాగార్జునాచారి అన్నారు. మట్లి సచివాలయంలో ఆయన మాట్లాడారు. అధికారులు జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాలన్నారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో రామచంద్రారెడ్డి, ఏపీవో నాగరాజు, పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధికి విద్యార్థుల విరాళం



ఎంఈవో చక్రధర్‌రాజుకు చెక్కు అందిస్తున్న విద్యార్థులు, పాఠశాల సిబ్బంది

పుల్లంపేట, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల సహాయార్థం ప్రత్యూష పాఠశాల విద్యార్థులు సేకరించిన రూ.52,350 నగదు చెక్కును సీఎం సహాయ నిధికి అందించాలని ఎంఈవో చక్రధర్‌రాజుకు బుధవారం అందించినట్లు హెచ్ఎం నరసింహులు తెలిపారు. వరద బాధితుల బాగు కోసం తమ పాఠశాల పిల్లల్లో చైతన్యం వచ్చి విరాళాలు సేకరించారని ఆయన వివరించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, సీఆర్పీలు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ పరీక్షలకు ఎంపిక



విద్యార్థులకు జ్ఞాపిక, ప్రశంసాపత్రాలు అందిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

పుల్లంపేట, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకే చెకుముకి సైన్స్ పరీక్షలు నిర్వహిస్తున్నామని ఎంఈవో చక్రధర్‌రాజు పేర్కొన్నారు. మండల స్థాయిలో జరిగిన పరీక్షల్లో ఆదర్శపాఠశాల, ప్రత్యూష పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచినట్లు మండల కన్వీనర్ రాజయ్య బుధవారం తెలిపారు. వీరు ఈ నెల 27న జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనున్నారని తెలిపారు. అనంతరం విద్యార్థులకు జ్ఞాపికలతో పాటు ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు.

ఖైదీల సంక్షేమానికి కృషి

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: ఖైదీల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని కలెక్టరు లోతేటి శివశంకర్ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా కడప కేంద్రకారాగారంలో బుధవారం ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జైలు అధికారి రాజేశ్వరరావు అధ్యక్షత వహించారు. తొలుత గాంధీజీ, లాల్‌బహుదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కలెక్టరు మాట్లాడుతూ ఖైదీలు సత్ప్రవర్తనతో జీవించాలన్నారు. జైలులో ఇస్తున్న శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఖైదీలు మంచి నడవడిక కలిగి ఉండాలన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అదనపు డీఎంహెచ్‌వో రవిబాబు, సివిల్ సర్జన్ శ్రీనివాసరావు, మానసిక కౌన్సిలర్ సునీత, ఉప పర్యవేక్షణాధికారి జవహర్‌బాబు, రమేష్, వైద్యులు పుష్పలత తదితరులున్నారు.

పెన్నాలో మునిగి బాలుడి మృతి



సిద్దవటం, న్యూస్‌టుడే : ఆరేళ్ల బాలుడు పెన్నాలో మునిగి మృతి చెందిన సంఘటన బుధవారం సిద్దవటం వద్ద చోటుచేసుకుంది. అన్నమయ్య జిల్లా పుల్లంపేట పట్టణంలోని జెండామాను వీధికి జాకీర్, జరీనాకు అయిదుగురు సంతానం. వారిలో చివరి కుమారుడైన **ఇస్మాయిల్** తన బాబాయి కుటుంబంతో విహారయాత్రకు సిద్దవటం వచ్చాడు. మట్లిరాజుల కోటను సందర్శించిన అనంతరం వారు పెన్నానది వద్దకు వచ్చారు. పిల్లలందరూ లోలెవెల్ కాజ్‌వే పక్కన ఉన్న పెన్నాలోని ఇసుక మేటలపై ఆడుకుంటుండగా ఇస్మాయిల్ అదుపు తప్పి నదిలోకి జారి మునిగిపోయాడు. గమనించిన బంధువు, మరో ఇద్దరు యువకులు అతన్ని కాపాడేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. సమాచారం తెలుసుకున్న ఒంటిమిట్ట సీఐ కృష్ణంరాజు నాయక్ సంఘటనా స్థలానికి చేరుకుని, గజ ఈతగాళ్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టగా, కొంత సమయానికి బాలుడి మృతదేహం బయటపడింది. చిన్నారి మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు విలపించారు.

4న కడపలో ఉద్యోగ మేళా

వైవీయూ (కడప), న్యూస్‌టుడే: కడప నగరంలోని కాగితాలపెంటలో ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 4న శుక్రవారం ఉదయం 10 గంటలకు ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ఏడీ కె.రత్నబాబు ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువతీ, యువకులు హాజరుకావాలని సూచించారు. ఐసీఐసీఐ బ్యాంక్, అభి గ్రీన్ టెక్నాలజీ, రిలయన్స్ తదితర కంపెనీలు పాల్గొంటాయని చెప్పారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ విద్యార్హత పత్రాలు ఆధార్, రెండు ఫొటోలు తీసుకురావాలని తెలిపారు.

6 నుంచి ఏపీటీఎఫ్ ఓక్ జూబ్లీ వేడుకలు

కడప గ్రామీణ, న్యూస్‌టుడే: విజయనగరంలో ఈ నెల 6 నుంచి 8 వరకు నిర్వహించే ఓక్ జూబ్లీ వేడుకలను విజయంతం చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి అబ్దుల్లా పేర్కొన్నారు. బుధవారం జిల్లా ఎన్జీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గోడపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతు ఏపీటీఎఫ్ ఏర్పాటు అయి 80 ఏళ్లు అయిన నేపథ్యంలో విజయనగరంలో వరుసగా మూడు రోజులు నిర్వహించే ఓక్‌జూబ్లీ వేడుకలతో పాటు 20వ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలన్నారు. సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు నాగభూషణం, జిల్లా కార్యదర్శి చెన్నారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభలతో పంచాయతీల అభివృద్ధి : మంత్రి



జ్యోతి వెలిగిస్తున్న మంత్రి మండిపల్లి, కలెక్టర్ శ్రీధర్

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: గ్రామ సభలతో పంచాయతీలు అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి చెందాలని రవాణా, క్రీడ, యువజన శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. లక్కిరెడ్డిపల్లెలో బుధవారం ప్రజాదర్బార్ ప్రత్యేక గ్రామసభ సర్పంచి అహల్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ గ్రామ సభకు కలెక్టర్ శ్రీధర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి వెలగించారు. మంత్రి, కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 750 గ్రామ పంచాయతీల్లో రాష్ట్రం నుంచి 12 పంచాయతీలు ప్రత్యేక గ్రామ సభల ప్రజా ప్రణాళికకు ఎన్నిక కాగా అందులో లక్కిరెడ్డిపల్లె ఉండటం గర్వకారణమన్నారు. జిల్లాలో చేపట్టిన స్వచ్ఛతహీ సేవా కార్యక్రమాల్లో కలెక్టర్ ఆధ్వర్యంలో స్వచ్ఛ కార్మికులు, అధికారులు, ప్రజలందరూ భాగస్వాములు కావడంతో ఉత్తమ పనితీరులో సఫారీ కర్మచారీ అంశంలో జిల్లాకు అవార్డు దక్కడం మనందరికీ గర్వకారణమన్నారు. డీఎల్‌పీవో పార్వతి, తహసీల్దారు లక్ష్మీప్రసన్న, ఈవోపీఆర్డీ పట్నాయక్, పంచాయతీ సెక్రటరీ ఎం.సుదర్శన్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు యనమల మదన్‌మోహన్, అధికారులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి కృషి

రాయచోటి: పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని 300 మంది పారిశుద్ధ్య కార్మికులకు మండిపల్లి నాగిరెడ్డి ట్రస్టు ద్వారా బుధవారం వస్త్రాలు, పాదరక్షలను ఉచితంగా పంపిణీ చేశారు. నగరాన్ని స్వచ్ఛంగా ఉంచడంలో కార్మికుల పాత్ర కీలకమన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలలో జిల్లాకు ఉత్తమ అవార్డు రావడం హర్షణీయమన్నారు. అనంతరం పురపాలక సిబ్బంది, అధికారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కమిషనర్ వాసుబాబు, ట్రస్టు సభ్యులు, తెదేపా నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం : గాలివీడు: ప్రజా సమస్యల పరిష్కారానికి అన్ని వేళల పని చేస్తామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గాలివీడులో బుధవారం ఆయన పర్యటించారు. స్థానికులు మంత్రికి పలు సమస్యలపై అర్జీలు సమర్పించారు. తెదేపా మండల బాధ్యుడు హేమకుమార్‌రెడ్డి, వక్ఫ్‌బోర్డు మాజీ సభ్యుడు మహబుబ్‌బాషా, మాజీ సర్పంచి బీకే మహమ్మద్ రియాజ్, వీరభద్రనాయుడు, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య, నాయకులు పాల్గొన్నారు.

కబడ్డీ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



సందీప్



హరికృష్ణ

గాలివీడు, న్యూస్‌టుడే: గాలివీడు జడ్పీ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థులు సందీప్, హరికృష్ణ కబడ్డీ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పీడీ గంగరాజు పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రామపురంలోని గురుకుల పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొని అండర్-17 విభాగంలో కబడ్డీ జట్టులో ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర స్థాయి జట్టులో స్థానం దక్కిందన్నారు.

ఉత్తమ పంచాయతీ కార్యదర్శిగా నరసింహులు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: కూచివారిపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న నరసింహులు కేంద్రం ప్రభుత్వం నుంచి ఉత్తమ పంచాయతీ కార్యదర్శిగా ఎంపికయ్యారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని దిల్లీలో బుధవారం జరిగిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో కేంద్ర మంత్రుల నుంచి ఆనయ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం నుంచి అవార్డుకు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. సఫాయి మిత్రగా కూచివారిపల్లిలో పని చేస్తున్న ఎల్,నాగరాజుకు అవార్డు దక్కిందన్నారు.

ఎక్సైజ్ పోలీసు స్టేషన్ తనిఖీ

సిద్దవటం, న్యూస్‌టుడే : సిద్దవటంలోని ఎక్సైజ్, ప్రొహిబీషన్ పోలీసు స్టేషన్‌ను బుధవారం ఆ శాఖ సూపరింటెండెంట్ రవికుమార్ తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. సిద్దవటం, అట్లూరు, ఒంటిమిట్ట మండలాల పరిధిలో నాటు సారా, మత్తు పదార్థాలు, అక్రమ మద్యం విక్రయాలు జరగకుండా నిఘా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. సీఐ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి సామగ్రి వితరణ

చిన్నమండెం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని మల్లూరు గ్రామం గంగిరెడ్డిగారిపల్లె అంగన్‌వాడీ కేంద్రానికి గ్రామానికి చెందిన పలువురు దాతలు పలు వస్తువులను వితరణ చేశారు. ముందుగా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అల్లం రెడ్డెప్పరెడ్డి టేబుల్, శ్రీలత కుక్కర్, ఈశ్వర, కృష్ణలు ఆట వస్తువులు ఇచ్చారు. ఆనంద, మల్లికార్జున, ప్రమీల వంట పాత్రలు అందజేశారు. వారిని గ్రామస్థులు, అంగవాడీ సిబ్బంది అభినందించారు.

ఇస్లామియా ధార్మిక శిక్షణ శిబిరం ప్రారంభం

సుండుపల్లి, న్యూస్‌టుడే: సుండుపల్లి దారుసలాం మసీదులో బుధవారం నుంచి వారం రోజుల పాటు ఇస్లామియా ధార్మిక శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. షరియా ప్రాథమిక నియమాలు, మసాయిలు బోధించడం, ఉత్తమమైన గుణాలు నేర్పిస్తామని నిర్వాహకులు తెలిపారు. వ్యక్తిత్వ వికాసం, జనరల్ నాలెడ్జి శిక్షణతో పాటు దేశంలో శాంతి సుఖాలతో అందరితో ప్రేమాభిమానంతో మసలుకొనేలా అవగాహన కల్పిస్తామన్నారు. జిల్లా అధ్యక్షుడు జఫరుల్లాఖాన్ మహల్ అంజద్‌బాషా, సాబ్జాన్‌బాషా, ఫయాజ్‌ఖాన్, తొట్టి ఖాదర్‌బాషా తదితర సభ్యుల ద్వారా ఈ శిక్షణా కార్యక్రమం జరుగుతోందని తెలిపారు.

జిల్లాకు స్వచ్ఛతా హీ సేవ పురస్కారం

మచిలీపట్నంలో అవార్డు అందుకున్న డీపీవో ధనలక్ష్మి



మచిలీపట్నం జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ నుంచి అవార్డు అందుకుంటున్న డీపీవో ధనలక్ష్మి

రాయచోటి, న్యూస్‌టుడే: ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో స్వచ్ఛత కార్యక్రమాలను అధికారులు ముమ్మరంగా చేపట్టారు. స్వచ్ఛత, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ఇతర ప్రదేశాలలోని చెత్తను గుర్తించి దానిని ఎప్పటికప్పుడు శుభ్రపరిచారు. పరిసరాల పరిశుభ్రతలో భాగంగా జిల్లాలో చేపట్టిన కార్యక్రమాలు రాష్ట్రంలో ముందు వరుసలో నిలిచాయి. దాంతో ప్రభుత్వం జిల్లాకు స్వచ్ఛత హీ సేవ కార్యక్రమానికి ఉత్తమ అవార్డు ప్రకటించింది. మచిలీపట్నంలో బుధవారం సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా అవార్డు అందుకోవాల్సి ఉండగా... ఆయన ముందుగా అక్కడి నుంచి వెళ్లిపోవడంతో మచిలీపట్నం జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ చేతుల మీదుగా జిల్లా పంచాయతీ అధికారిణి ధనలక్ష్మి అవార్డును అందుకున్నారు. జిల్లాలోని అన్ని శాఖల సమన్వయంతోనే జిల్లాకు గౌరవం దక్కిందని ఆమె చెప్పారు.

జిల్లా బాస్కెట్‌బాల్ జట్టు ఎంపిక



పోటీలకు ఎంపికైన జిల్లా బాస్కెట్‌బాల్ జట్టు

కడప క్రీడలు, న్యూస్‌టుడే: జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కడప నగరంలోని జయనగర్ కాలనీ జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి బాలబాలికల సబ్ జూనియర్స్ ఎంపికల పోటీలు ఉత్సాహంగా సాగాయి. సంఘం అధ్యక్షుడు ఎన్.సహదేవరెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. పీడీలు కె.కృష్ణప్రసాద్, పి.సువర్ణ, బి.వెంకటసుబ్బమ్మ, సి.మంజునాథ, క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపికైన వారి వివరాలు ఇలా ఉన్నాయి..

బాలుర విభాగం: జీవీ.చరణ్, జి.హేమవెంకటతరుణ్, సి.యోగేంద్ర, జీవీ.కిరణ్, పి.గౌతమ్, ఎ.సంతోష్, వి.గంగకార్తీక్, పి.రామ్‌చరణ్, కె.జాఫర్, ఎస్ఎండీ గౌస్, జి.విజయ్, ఎస్‌కే.మౌలాలి

బాలికల విభాగం: ఎం.చంద్రమౌనిక, వి.అమృతవర్షిత, డి.సింధు, సి.బిందుమాధురి, డి.షర్మిల, పి.దుర్గ, ఎస్.ముస్కాన్, డి.తస్లీం, కె.లాస్య, ఎం.సాయిచైత్ర, పి.హర్షిత, బి.మౌనిక

4 నుంచి అండర్-14 క్రికెట్ పోటీలు

కడప క్రీడలు, న్యూస్‌టుడే: జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 4 నుంచి 23వ తేదీ వరకు ఏసీఏ అండర్-14 పురుషుల రెండు రోజుల మల్టీడే ఇంటర్ డిస్ట్రిక్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నట్లు అసోయేషన్ కార్యదర్శి ఎ.రెడ్డి ప్రసాద్ ప్రకటనలో పేర్కొన్నారు. వైఎస్సార్‌తో పాటు చిత్తూరు, కర్నూలు, విశాఖపట్నం, ప్రకాశం, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లా జట్లు పోటీపడతాయన్నారు. ఈ సందర్భంగా జిల్లా జట్టును ప్రకటించారు.

జట్టు సభ్యులు: పి.హితేష్ సాయి (కెప్టెన్), సీవీఎస్ ప్రశాంత్, జి.సూర్యతేజ్‌రెడ్డి, ఎ.అభినివేష్‌రెడ్డి, ఎ.జగదీశ్వర్‌రెడ్డి, కె.లోకేష్, ఎస్ఎండీ తాహీర్, జేపీ.ఖలీద్, ఆర్.యోగాంజనేయులు, ఎస్ఎండీ.ఫైజాన్, ఆర్‌పీ.ఇమాన్యుల్, బి.సాయిక్రిష్ణచైతన్య, పి.అజద్‌అలీఖాన్, బి.మునిజ్ఞానేశ్వర్‌రెడ్డి, జి.ఆదిత్య, జి.మనస్‌నందన్, పి.అస్కాన్‌ఖాన్, ఎ.చెన్నకేశవ ఎంపికవ్వగా, స్టాండ్‌బైగా వి.రామ్‌చరణ్, యు.శివచరణ్, ఎస్.భానువర్షిత్‌రెడ్డి, ఉమర్‌సిద్ధిఖ్, ఎం.వర్షిత్‌కుమార్, వి.శేరాయణరెడ్డి ఎంపికయ్యారు.

మహాత్ముడి మార్గం.. అనుసరణీయం

ఘనంగా జయంతి వేడుకలు



రాయచోటిలో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు



రాజంపేటలో నినాదాలు చేస్తున్న బత్యాల చంగలరాయుడు, కార్యకర్తలు



పుల్లంపేటలో గాంధీజీ, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటాల వద్ద ఉపాధ్యాయుల నివాళులు

మహాత్మాగాంధీ స్ఫూర్తితో అందరూ స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌కు కృషి చేయాలని వక్తలు కోరారు. మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో ఆయన విగ్రహానికి పలు సంఘాల నేతలు, అధికారులు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. స్వాతంత్ర్య పోరాటంలో ఆయన పాత్రను, చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. నేటి యువత మహాత్ముడి బోధనలను ఆచరించాలని సూచించారు. విద్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో వేడుకలు నిర్వహించారు. పలు చోట్ల దివంగత ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు నిర్వహించారు.

\- న్యూస్‌టుడే, రాయచోటి క్లస్టర్ బృందం



రాజంపేటలో ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో..



రాజంపేట గ్రామీణ: గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న సీఐ రమణ



రాయచోటి : గాంధీ చిత్రపటానికి వందనం చేస్తున్న డీఎస్పీ చిన్నికృష్ణుడు

రాయచోటి

• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

పవన్ కల్యాణ్‌ను కలిసిన బత్యాల

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ విషయంపై ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టి తిరుమలకు చేరుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చంగలరాయుడు పేర్కొన్నారు. సనాతన ధర్మ పరిరక్షణ పట్ల ఆయన చూపుతున్న బాధ్యతాయుతమైన చర్యలపై అభినందనలు తెలిపామన్నారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.


పవన్‌కల్యాణ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న బత్యాల చంగలరాయుడు

సనాతన ధర్మ పరిరక్షణకు చర్యలు చేపట్టాలి

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సనాతన ధర్మ పరిరక్షణకు చర్యలు చేపట్టాలంటూ హిందూ ధార్మిక పరిషత్తు సభ్యులు స్థానిక టోల్‌గేట్ వద్ద బుధవారం ఒక రోజు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. తితిదే ప్రాశస్త్యాన్ని పరిరక్షించడం, తిరుమల లడ్డూ తయారీకి స్వయం ప్రతిపత్తిని కల్పించడం వంటి అంశాలపై పాలకులు పటిష్ఠ నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు సుగవాసి మల్లికార్జున, అదనుకోట నరసింహులు, రామసుబ్బారెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.


రిలే నిరాహార దీక్ష చేస్తున్న హిందూ ధార్మిక పరిషత్తు సభ్యులు

ప్రధాని మోదీ సమావేశానికి మల్లూరు సర్పంచి

చిన్నమండెం, న్యూస్‌టుడే: గాంధీ జయంతి సందర్భంగా దేశ రాజధాని దిల్లీలో నిర్వహించిన స్వచ్ఛభారత్ దివస్ కార్యక్రమానికి మల్లూరు గ్రామ సర్పంచి డి.నజీర్‌బాషా హాజరయ్యారు. రాష్ట్రం నుంచి 17 మంది సభ్యులు పాల్గొనగా అందులో 8 మంది సర్పంచులు తరలి వెళ్లారు. వారిలో మల్లూరు సర్పంచి ఉన్నారు. స్వచ్ఛభారత్‌పై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచనలు, సలహాలు చేశారని ఆయన వివరించారు. ఆయన వెంట చిట్వేలి మండలానికి చెందిన పంచాయతీ కార్యదర్శి నరసింహులు, రాజంపేట మండలానికి చెందిన సఫాయి మిత్ర నాగరాజులున్నారు.

నేటి నుంచి శరన్నవరాత్రులు

ముస్తాబైన ఆలయాలు



రైల్వేకోడూరు అమ్మవారిశాలలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మహిళలు.. విద్యుత్తు దీపాలంకరణలో రాజంపేట సాధుకామాక్షమ్మ అమ్మవారి ఆలయం

నేటి నుంచి దసరా శరన్నవరాత్రులు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా వేడుకలకు అమ్మవార్ల ఆలయాలను నిర్వాహకులు ముస్తాబు చేశారు. ప్రధానంగా రాజంపేట పట్టణంలోని వాసవీకన్యకాపరమేశ్వరీదేవి ఆలయం, సాధుకామాక్షమ్మ, వీరచౌడేశ్వరీదేవి, ఉదయగిరి ఎల్ల ఆలయంతో పాటు మన్నూరులోని సాధుకామాక్షమ్మ ఆలయాలను విద్యుత్తు దీపాలతో అందంగా అలంకరించారు. తొలి రోజు గురువారం ఆలయాల్లో దీక్షాబంధన అలంకారంలో అమ్మవార్లు భక్తులకు దర్శనమివ్వనున్నారు. వెంకటరాజంపేటలోని కనక దుర్గమ్మ ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు తొమ్మిదిరోజుల పాటు జరగనున్నాయమని ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు తెలిపారు. రైల్వేకోడూరు పట్టణంలోని అమ్మవారిశాలలో నేటి నుంచి ఉత్సవాలు ప్రారంభిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గునిశెట్టి రమేష్ తెలిపారు. కలశ స్థాపనతో ఉత్సవాలు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమాలకు అంకురార్పణగా బుధవారం బాలాలయంలోని అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

- న్యూస్‌టుడే, రాయచోటి క్లస్టర్ బృందం

నేడు బోడిరెడ్డిగారిపల్లిలో ఉచిత పశువైద్య శిబిరం

రాయచోటి, చిన్నమండెం, న్యూస్‌టుడే: ఈ నెల 3వ తేదీ గురువారం చిన్నమండెం మండలం బోడిరెడ్డిగారిపల్లిలో ఉచిత పశువైద్య శిబిరం, సంకర జాతి దూడల ప్రదర్శన నిర్వహించనున్నామని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి గుణశేఖర్‌పిళ్లై బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పాడి రైతులు, గొర్రెలు, మేకల పెంపకందారులు పాల్గొని పశువులు, జీవాలకు ఉచిత వైద్య సేవలు పొందాలన్నారు. ఖనిజ లవణాల మిశ్రమం, మందులు ఉచితంగా పంపిణీ చేస్తామని వివరించారు. అవకాశాన్ని పశుపోషకులు, సన్న జీవాల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం నాయకులు

ఒప్పంద ఉద్యోగుల కుటుంబాల్లో వెలుగులు నింపాలి

రాయచోటి, న్యూస్‌టుడే: గాంధీ జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్‌లోని గాంధీ విగ్రహానికి సమగ్ర శిక్షా అభియాన్‌లో పని చేస్తున్న ఉద్యోగులు పూల మాలలు వేసి నివాళి అర్పించారు. స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు కావొస్తున్నా కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ జీవితాల్లో వెలుగులు రాలేదని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు పేర్కొన్నారు. ఇప్పటికైనా తమ బతుకులు మారేలా అధికారులు, నాయకులతో మాట్లాడమని కోరుతూ గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందిచంఆరు. యూనియన్ నాయకులు షేక్ అలీహుస్సేన్, సభ్యులు ప్రదీప్‌కుమార్, రెడ్డిలక్ష్మీ, సాబిరుణ్, సమియున్ పాల్గొన్నారు.

కరాటేలో సత్తా చాటిన విద్యార్థులకు అభినందన

రాయచోటి, న్యూస్‌టుడే: ఓపెన్ లెవెల్ గుజూరియో కరాటే స్టైల్ కర్నూలు ఇంటర్ స్టేట్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను బుధవారం తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు అభినందించారు. విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. సబ్ జూనియర్స్ లీ డ్రాగన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ స్టూడెంట్స్ ఆరు మంది పోటీల్లో పాల్గొన్నారని నిర్వాహకులు పేర్కొన్నారు. వేరియేషన్స్ ఆఫ్ వెయిట్స్‌లో సబ్ జూనియర్స్‌లో మూడు బంగారు పతకాలు, మూడు సిల్వర్ మెడల్స్ సాధించారని శిక్షకుడు దేవేంద్రకుమార్ పేర్కొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న సుగవాసి ప్రసాద్‌బాబు

యూటీఎఫ్ క్రీడా పోటీల ప్రారంభానికి ఆహ్వానం

చిన్నమండెం, న్యూస్‌టుడే: యూటీఎఫ్ ఏర్పడి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జరుగుతున్న స్వర్ణోత్సవాల్లో భాగంగా ఈ నెల 4 నుంచి మూడు రోజుల పాటు గుంటూరులో జరిగే రాష్ట్ర స్థాయి ఉపాధ్యాయుల క్రీడా పోటీలను ప్రారంభించాలని ఆ సంఘ నాయకులు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని ఆహ్వానించారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో జిల్లా స్థాయిలో గెలిచిన ఉపాధ్యాయులు రాష్ట్ర స్థాయిలో ఆడతారని ఆయనకు వివరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జాబిర్, వైఎస్సార్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్‌బాబు, నరసింహారావు, ఏజాస్‌లు పాల్గొన్నారు.

పల్లెల్లో పశుసంపద పెరగాలి

ఈటిమార్పురం(పెనగలూరు),న్యూస్‌టుడే: గ్రామాలలో పశుసంపద పెరగాలని కాకర్లవారిపల్లి పశువైద్యాధికారి వేదవతి తెలిపారు. బుధవారం ఈటిమార్పురంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ వారి సౌజన్యంతో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. నట్టల నివారణ మందులను పాడిరైతులకు అందించారు.

ఇసుక ట్రాక్టరు స్వాధీనం

సుండుపల్లి, న్యూస్‌టుడే: బాహుదా నది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టరును రాయవరం క్రాస్ సమీపంలో బుధవారం స్వాధీనం చేసుకున్నామని హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మీనరసయ్య తెలిపారు. చోదకుడిపై కేసు నమోదు చేశామని ఆయన వివరించారు.

బాధ్యతలు చేపట్టిన ఎక్సైజ్ సీఐ, ఎస్.ఐ.


టీకే తులసి


వరుణ్‌కుమార్

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: ఎక్సైజ్ శాఖ రైల్వేకోడూరు సీఐగా టీకే తులసి బుధవారం బాధ్యతలు చేపట్టారు. స్థానిక కార్యాలయంలో కడప నుంచి బదిలీపై ఇక్కడ కొచ్చారు. ఎస్సైగా వరుణ్ కుమార్ బాధ్యతలు తీసుకున్నారు. మైదుకూరు నుంచి ఆయన బదిలీపై వచ్చారు. స్థానిక కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్దేశించిన బాధ్యతలను నిర్వర్తించడం, నాటు సారా తయారీ నిర్మూలన వంటి అంశాలపై చర్యలు చేపడతామని వివరించారు.

వింత వ్యాధితో ఆవుల మృత్యువాత

తూముకుంట(గాలివీడు), న్యూస్‌టుడే: తూముకుంట పంచాయతీ ప్రకాశ్‌నగర్‌కాలనీలో వింత వ్యాధి సోకి ఉన్నఫలంగా ఆవులు మృతి చెందుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. బుధవారం నాలుగు ఆవులు మృతి చెందినట్లు పశు పోషకుడు మల్లికార్జుననాయుడు తెలిపారు. ఈ విషయమై పశువైద్యాధికారి భాస్కర్‌ను వివరణ కోరగా.. గురువారం గ్రామానికి వెళ్లి వ్యాధికి గురైన పశువులను పరీక్షిస్తామన్నారు. టీకాలు వేసే కార్యక్రమం ఏర్పాటు చేస్తామన్నారు.